JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి I మంగళవారం 12-08-2025
Medchal - Malkajgiri I Tuesday 12-08-2025
jayabherinews
సంపుటి : 02 I సంచిక : 79 I పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 79 I Pages : 8 I ₹: 5

అగ్ర కథానాయిక పూజాహెగ్డే తన సినీ ప్రయాణంలో విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నది. భారీ సినిమాల్లో అవకాశాలొస్తున్నా..విజయాలు వరించకపోవడం ఈ మంగళూరు సుందరిని కలవరపెడుతున్నది. ఎలాగైనా ఓ భారీ హిట్‌తో పరాజయాలపరంపరకు బ్రేక్ వేయాలనే కృతనిశ్చయంతో ఉంది. వరుస ఫ్లాపులొచ్చినా ఆఫర్ల పరంగా తనకు ఢోకాలేదని ధీమా వ్యక్తం చేస్తున్నది. ఈ నేపథ్యంలో తెలుగులో ఈ భామ మరో పెద్ద ప్రాజెక్ట్‌లో నాయికగా ఎంపికైనట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. నితిన్ హీరోగా విక్రమ్ కుమార్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామాకు సన్నాహాలు జరుగుతున్నాయి.






✍ జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 11:

పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సహా పలువురు కీలక నేతలను అరెస్టు చేశారు. ప్రత్యేక బస్సుల్లో వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ అరెస్టుల నేపథ్యంలో ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది.లోక్ సభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెంచేందుకు ఈ రోజు విపక్ష కూటమి ఎంపీలంతా ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి మార్చ్ నిర్వహించేందుకు తలపెట్టగా అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు.సంసద్ మార్గ్‌ను బ్లాక్ చేశారు. భేటీకి 30 మందికి అనుమతిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించగా.. అందరం కలిసే వెళతామని ఇండియా కూటమి ఎంపీలు పట్టుబట్టారు. పోలీసులు అడ్డుగా పెట్టిన బారికేడ్లు ఎక్కి అవతలకు దూకి రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల గోల్‌మాల్ జరిగిందని దీనిపై సమాధానం చెప్పాలని విపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.. అలాగే.. బిహార్‌లో ఓటర్ జాబితా ప్రత్యేక సవరణపై కూడా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.. కొత్త ఓటర్ల కోసమే ఫామ్6 ఉపయోగిస్తారనీ, కానీ తొలిసారి ఓటర్ కాని వృద్ధుల కోసం కూడా పదేపదే ఫామ్6 వాడుతున్నారని రాహుల్‌గాంధీ EC దృష్టికి తెచ్చారు. శకున్ రాణి అనే మహిళ ఓటు గురించి వివరాలు రాహుల్ సమర్పించారు. ఇలాంటి ఎన్నో ఓట్ల బాగోతం బయటపడుతుందని తెలిసే, EC తమకు డిజిటల్ డేటాను ఇవ్వడం లేదన్నది రాహుల్ ఆరోపణ.

## శశిధరూర్ ప్రత్యక్షం

ఎలక్షన్ కమిషన్ కు వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ చేపట్టింది. పార్లమెంట్ నుంచి ఎలెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో విపక్ష ఎంపీలు కేంద్రానికి, ఈసీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విపక్ష ఎంపీల ర్యాలీని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనుమతి లేదంటూ బ్యారికేడ్లు అడ్డు పెట్టారు. దీంతో పోలీసులతో ఎంపీలు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, పలువురు మహిళా ఎంపీలు బ్యారికేడ్లు దూకేందుకు యత్నించారు.మరోవైపు, ఇటీవలి కాలంలో కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ అనూహ్యంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కొంత కాలంగా శశిథరూర్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. సొంత పార్టీపై విమర్శలు గుప్పిస్తూ, బీజేపీ నేతలతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఇండియా కూటమి ర్యాలీలో ఆయన పాల్గొనడం ఆసక్తికరంగా మారింది.

# ఢిల్లీలో విపక్ష ఎంపీలు ఆందోళన

- ఢిల్లీలో ఉద్రిక్తత..
- బారికేడ్లు ఎక్కి దూకిన ఎంపీ అఖిలేష్ యాదవ్



✍ జయభేరి, న్యూ డిల్లీ ఆగస్టు 11 :

బీహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఎంపీలు మార్చ్ చేపట్టారు. ఎంపీలు చేపట్టిన ఈ ర్యాలీ ఉద్రిక్తతంగా మారింది.ఇండియా కూటమి ఎంపీల ర్యాలీతో అప్రమత్తమైన పోలీసులు సంసద్ మార్గ్‌లో భారీగా మోహరించారు. ఈసీ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్తున్న ఎంపీలను బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదని చెప్పారు. అయితే, ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాజ్‌వాది పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేష్ యాదవ్ బారికేడ్లు ఎక్కి దూకారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. మరోవైపు ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు పాల్గొన్నారు. వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఎంపీల నిరసనతో రాజధాని ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# యూపీని ముంచేసిన వరదలు



- 9 జిల్లాలు అతలాకుతలం

✍ జయభేరి, లక్నో, ఆగస్టు 11 :

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వరద ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మంత్రులు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తున్నారు. సహాయ సామగ్రిని పంపిణీ చేయడంతో పాటు, మంత్రులు బాధితుల యోగక్షేమాలను కూడా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 36 జిల్లాల్లోని 92 తహసీళ్ళు, 1,877 గ్రామాలు ప్రస్తుతం వరదల బారిన పడ్డాయని రిలీఫ్ కమిషనర్ భాను చంద్ర గోస్వామి తెలిపారు. ఈ ప్రాంతాల్లో 6,42,913 మంది వరదల బారిన పడ్డారు, వారికి సహాయం అందించబడిందని చెప్పారు.వరద కారణంగా 84,700 పశువులను సురక్షిత ప్రదేశానికి తరలించారు. ఇప్పటివరకు, వరద కారణంగా 573 మంది ఇళ్ళు దెబ్బతిన్నాయి.వాటిలో 465 మందికి సహాయ మొత్తాన్ని అందించారు. రాష్ట్రంలో 61,852 హెక్టార్లకు పైగా ప్రాంతం వరద ప్రభావానికి

...మిగతాది 2 లో



2 లో

# భాగ్యనగరం.. బాగుపడేదెప్పుడూ..

*అరగంట వాన పడితేనే భాగ్యనగరం వీధులు నదుల్లా మారిపోతున్నాయి. నడుము లోతు వరకూ నీరు చేరి, రోడ్లపై మాన్‌హోల్స్ ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తుపట్టలేని పరిస్థితి. వర్షం పడుతుందంటే నగర ప్రజల హృదయాల్లో భయం పుడుతోంది "ఇంటికి సురక్షితంగా చేరతామో లేదో?" అన్న ఆందోళన.భాగ్యనగరం (హైదరాబాద్) వర్షా కాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా వర్షం పడినప్పుడు వీధులు నదుల్లా మారడం, నగర ప్రజలకు నిత్యకృత్యంగా మారాయి.*

# జై కిసాన్ ఎత్తి పోతల ప్రాజెక్ట్ ని బాగు చేయాలనీ వినతి

3 లో




# నెలాఖరులో స్థానిక నగారా




- సన్నద్ధంగా ఉండాలని క్యాడర్‌కు టీపీసీసీ ఆదేశాలు

✍ జయభేరి, హైదరాబాద్ :

స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులో నగారా మోగే అవకాశాలున్నాయి. ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని టీపీసీసీ నుంచి ఎమ్మెల్యేలు, నాయకులకు ఆదేశాలు అందినట్లు సమాచారం, రాజకీయాల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై చేసిన బిల్లులు, ఆర్డినెన్స్‌లు ఆమోదం కోసం రాష్ట్రపతి చెంతకు చేరాయి. వాటిని ఆమోదించేలా ఇటీవల మూడు రోజుల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి సహ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు ఢిల్లీలోనే ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ధర్నా చేశారు. పార్లమెంట్‌లో చర్చకు వాయిదా తీర్మానాలు ఇస్తే ప్రభుత్వం తోసి పుచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని

...మిగతాది 2 లో

# ఎకనమిక్ హబ్‌గా పోర్టులు

- కార్గో హ్యాండ్లింగ్ కోసం లాజిస్టిక్స్ కార్పోరేషన్
- సరుకు రవాణా మార్గాలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్
- షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు
- మరిన్ని పెట్టుబడుల కోసం మారిటైం పాలసీలో మార్పులు
- పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సమీక్షలో సీఎం చంద్రబాబు

✍ జయభేరి, అమరావతి, ఆగస్టు 8 :



ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల సరకు రవాణాను నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, రైలు, అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా చేపట్టే సరకు రవాణాను ఈ కార్పోరేషన్

...మిగతాది 2 లో

# మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?

- ధన్‌ఖడ్ రాజీనామాపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాలు

✍ జయభేరి, న్యూ డిల్లీ, ఆగస్టు 11 :

ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. ఆయన నిర్ణయం అందరినీ షాక్‌కు గురి చేసింది. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు రాజీనామా తర్వాత నుంచి ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఎకనమిక్ హబ్‌గా పోర్టులు

ద్వారానే నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. ఎయిర్ పోర్టులుపోర్టుల అభివృద్ధి, మారిటైం పాలసీలో తీసుకురావాల్సిన మార్పులు, లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.."రాష్ట్రంలో 20 పోర్టులు, మరిన్ని ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాం. ఆపరేషనల్గా ఉన్న పోర్టులు, ఎయిర్ పోర్టుల నుంచి పెద్ద ఎత్తున కార్యకలాపాలు జరుగుతున్నాయి. ప్రతి పోర్టు, ఎయిర్ పోర్టుల సమీప ప్రాంతాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఓడరేవులు, విమానాశ్రయాలకు అనుసంధానించేలా శాటిలైట్ టౌన్ షిప్పులను అభివృద్ధి చేయాలి. ఈ తరహా సమీకృత అభివృద్ధి ఎక్కడెక్కడ చేయగలమో..ఏ విధంగా చేయగలమనే అంశాలపై బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకోవాలి. రోడ్డు, రైలు, ఎయిర్ కార్గో, ఇన్ ల్యాండ్, మారి టైమ్ కార్గోలకు ఏపీనే కేంద్రంగా ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఏపీలో అన్ని రకాల సరుకు రవాణా మార్గాలు అందుబాటులో ఉంటే...అభివృద్ధి వేగంగా జరుగుతుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులకు అనుసంధానంగా నేషనల్ హైవే కనెక్టివిటీ, రైల్ కనెక్టివిటీ ఉండేలా చూసుకోవాలి. ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ కనెక్టివిటీ కూడా ఉంటే...రాష్ట్రం నుంచే సరుకు రవాణా ఎక్కువగా జరుగుతుంది. కేంద్రం వద్ద నేషనల్ హైవేలకు, రైల్వేలకు నిధుల కొరత లేదు. మనం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతిపాదనలు పంపితే వాటిని ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. దీన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి." అని చంద్రబాబు సూచించారు.
"రాష్ట్రంలో వివిధ మార్గాల ద్వారా చేపట్టే సరకు రవాణాను సమర్థంగా నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి. పోర్టులు, ఎయిర్ పోర్టుల సమీపంలో శాటిలైట్ టౌన్ షిప్పుల అభివృద్ధికి అవసరమైన సంస్థలను గుర్తించి పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలి. ఇదే తరహాలో 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసుకుంటున్న ఎంఎస్ఎంఈ పార్కుల వద్ద కూడా శాటిలైట్ టౌన్ షిప్పులను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేయాలి. కుప్పం, దగదర్తి విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలి. ఈ ఎయిర్ పోర్టులను నేషనల్ హైవేలను కలిపేలా అంతర్గత రోడ్ల నిర్మాణం ఉండాలి. అవసరమైతే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా దీనిని చేపట్టాలి." అని సీఎం చెప్పారు.

## నెలాఖరులో స్థానిక' నగారా

హైకోర్టు ఆదేశించిన మేరకు గడువు ముంచుకు వస్తున్నది. ఆ గడువులోగానే ఎన్నికలు నిర్వహించేం దుకు ముందుకు పోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఓవైపు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపపై కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికార పార్టీ సన్నద్ధం అవుతున్నది. రాజకీయాల వ్యవహారాల కమిటీ పీపీసీ,లోమంత్రులతో చర్చించిన తర్వాత ఎన్నికలపై ముందుకు సాగుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు రెండు, మూడు రోజుల్లో సమావేశాలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఎన్నికల విషయమై ప్రభుత్వం మూడు మార్గాలను అన్వేషిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో తీసుక వచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న 50 శాతం రిజర్వేషన్ల నిబంధనను పక్కనబెట్టి జీఓ తీసుకరావడం, ఎన్నికలు నిర్వహించకుండా నిలువరించడం, పార్టీ పరంగా 42 శాతం సీట్లు కేటాయించే మార్గాలను అన్వేషిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పటికే ఆలస్యమయ్యింది. ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంగా మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలు, ఆరు మాసాలుగా మున్సి పాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ప్రభుత్వంపై రాజకీయ పక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. చివరగా పార్టీ పరంగా 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించి ముందుకు పోవాలని భావిస్తున్నారు. మొదట జీఓ జారీ చేసి, దాని పర్యావసానాన్ని గమనిం చిన తర్వాత ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 50 శాతానికి మించకుండానే జనాభా, ఓటర్ల ప్రాతిపదికన స్థానాలను రిజర్వు చేయనున్నారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ స్థానాలకు రొటేషన్ ప్రకారమే రిజర్వు చేయనున్నారు. 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం లభించకుంటే ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ వైఖరిని ఎండగట్టాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో చేసిన 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకపోవాలని భావిస్తున్నారు. చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేసిన కులగణన సర్వే, అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులు, పంచాయతీరాజ్ చట్ట సవరణ కోసం తీసుక వచ్చిన ఆర్డినెన్స్‌ల గురించి ప్రజలకు వివరించాలని భావిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు నగారా మోగే అవకాశాలున్నాయని, స్థానిక ఎన్నికలకు పార్టీ క్యాడర్ సన్నద్ధంగా ఉండాలని టీపీసీసీ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తున్నది.

## మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ఎక్కడ..?

ఫలితం లేదు. ఆయన్ని సంప్రదించలేకపోతున్నారు. దీంతో 'జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.ఇదే విషయమై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను తాము చేరుకోలేకపోతున్నామని, ఆయన ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. ఆయన ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసినప్పటి నుంచి ధన్‌ఖడ్ గురించి ఎలాంటి సమాచారం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భద్రతపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది..? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా..? అని ప్రశ్నించారు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ ఎంపీలు ప్రయత్నించినట్లు చెప్పారు. కానీ, ఆయన్ని చేరుకోలేకపోతున్నట్లు వెల్లడించారు. ఆయన ప్రస్తుత లొకేషన్ ఏంటి? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని లేఖలో సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 21న రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## యూపీని ముంచేసిన వరదలు

గురైంది. 2,610 పడవలు, మోటారు పడవల సహాయంతో ఈ ప్రభావిత ప్రాంతాలకు సహాయ సామగ్రిని పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతాలలో 67,169 ఆహార ప్యాకెట్లు, 7,99,734 భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాలలో బాధితులకు లంగర్ ద్వారా ఆహారం అందిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించబడుతున్నాయంటే వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులతో పాటు పశువుల భద్రత, ఆహారాన్ని యోగి ప్రభుత్వం పూర్తిగా చూసుకుంటోంది. ఇప్పటివరకు, పశువులకు 11,640 క్వింటాళ్ల గడ్డిని పంపిణీ చేశారు. దీనితో పాటు, 5,83,758 క్లోరిన్ మాత్రలు, 2,88,860 ORS ప్యాకెట్లను కూడా పంపిణీ చేశారు. తద్వారా నీటి ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించవచ్చు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మొత్తం 475 ఆశ్రయాలు వరద బాధితులకు ఆశ్రయం ఇస్తున్నాయి. ఈ ప్రదేశాల్లో 65,437 మంది తాత్కాలికంగా నివసిస్తున్నారు. వరద బాధితులను 1,124 వైద్య బృందాలు వైద్య సహాయం అందిస్తున్నాయి. దీనితో పాటు, 1,517 వరద స్థావరాలను ఏర్పాటు చేశారు,ఏ జిల్లా వరదల బారిన పడ్డాయంటే ప్రస్తుతం రాష్ట్రంలోని 36 జిల్లాలు వరదల బారిన పడ్డాయి. వీటిలో అయోధ్య, బహ్రైచ్, బారాబంకి, బస్తీ, కస్గంజ్, హర్దోయి, మొరాదాబాద్, ముజఫర్‌నగర్, షాజహాన్‌పూర్, భదోహి, శ్రావస్తి, ఉన్నావ్, ఫరూఖాబాద్, మీరట్, హాపూర్, గోరఖ్‌పూర్, గోండా, బిజ్నోర్, బదౌన్, కాన్పూర్ నగర్, లఖింపూర్, బిజ్నోర్, బికోరాల్‌యాండా, బికోరాల్యా, బి. ఘాజీపూర్, మీర్జాపూర్, ప్రయాగ్‌రాజ్, వారణాసి, చందౌలీ, జలౌన్, కాన్పూర్ దేహత్, హమీర్‌పూర్, ఇటావా, ఫతేపూర్. ఈ జిల్లాలన్నింటిలోనూ సహాయక చర్యలు శరవేగంగా జరుగుతున్నాయి.వారణాసి, గోండా, బహ్రైచ్, ఫతేపూర్‌లలో పర్యటించిన మంత్రులు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సూచనల మేరకు మంత్రి వరద ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పరిశీలిస్తున్నారు. ఆయన వరద బాధితులను కలుసుకుని, వారికి సహాయ సామాగ్రిని పంపిణీ చేయడంతో పాటు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్నారు. అదే సమయంలో ఈ సంక్షోభ సమయంలో ప్రభుత్వం వారితో ఉందని వరద బాధితులకు ఆయన హామీ ఇస్తున్నారు. వారణాసిలో మంత్రి దయాశంకర్ మిశ్రా దయాళు కొత్వాన్ కపిల్ధారలో వరద బాధిత ప్రజలకు సహాయ సామాగ్రిని పంపిణీ చేశారు.

# భాగ్యనగరం.. బాగుపడేదెప్పుడూ..

**అరగంట వాన పడితేనే భాగ్యనగరం వీధులు నదుల్లా మారిపోతున్నాయి. నడుము లోతు వరకూ నీరు చేరి, రోడ్లపై మాన్‌హోల్స్ ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తుపట్టలేని పరిస్థితి. వర్షం పడుతుందంటే నగర ప్రజల హృదయాల్లో భయం పుడుతోంది "ఇంటికి సురక్షితంగా చేరతామో లేదో?" అన్న ఆందోళన.భాగ్యనగరం (హైదరాబాద్) వర్షా కాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా వర్షం పడినప్పుడు వీధులు నదుల్లా మారడం, నగర ప్రజలకు నిత్యకృత్యంగా మారాయి.**

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 11:**

అరగంట వానకే రోడ్లన్నీ నీటితో నిండిపోతున్నాయి, మాన్‌హోల్స్ కనిపించకుండా పోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు గంటల తరబడి కొనసాగి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ప్రతి వర్షాకాలంలో పునరావృతమవుతున్నా, దానికి శాశ్వత పరిష్కారం ఇంకా లభించలేదు.ఈ దుస్థితికి అనేక కారణాలు ఉన్నాయి.. హైదరాబాద్ నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థ చాలా పాతది మరియు విస్తరిస్తున్న నగర అవసరాలకు సరిపోవడం లేదు. జనాభా పెరగడం, కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందడం వల్ల నీటి మళ్లింపు సరిగ్గా జరగడం లేదు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నా, వాటికి అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కాలక్రమేణా నాలాలు, చెరువుల చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరిగి, సహజ నీటి ప్రవాహ మార్గాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. వర్షాకాలానికి ముందు డ్రెయినేజీ క్లీనింగ్, రోడ్ల మరమ్మతులు చేస్తామనే వాగ్దానాలు అమలుకు నోచుకోవడం లేదు. దీనివల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి, వరదలు సంభవిస్తున్నాయి. ప్రతి వర్షాకాలం భాగ్యనగరం మునిగిపోకుండా ఉండాలంటే తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలను అమలు చేయాలి. నగర జనాభా, విస్తరణకు అనుగుణంగా ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించడం, పాత వ్యవస్థను పునరుద్ధరించడం అవసరం. నాలాలు, చెరువుల చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలి. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, తద్వారా భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుంది. భవిష్యత్ నగర అభివృద్ధి ప్రాజెక్టులలో డ్రెయినేజీ, నీటి పారుదల వ్యవస్థలను సమగ్రంగా చేర్చాలి.భాగ్యనగరం అభివృద్ధి చెందాలంటే, ప్రాథమిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం తప్పనిసరి. వర్షం అంటే భయం కాకుండా, ఆనందం కలిగించే రోజు రావాలంటే, ఈ సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారాన్ని కనుగొనడం అవసరం. లేకపోతే, వర్షాకాలంలో నగర ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయి.

**నరకం చూపించిన వాన**

హైదరాబాద్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా కురిసిన వానకు జన జీవనం అస్తవ్యస్తమైపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ అడుగు కదలడానికి గంటలు పట్టింది. హైటెక్ సిటీ ప్రాంతంలో అయితే మరింత నరకప్రాయం. ఎక్కడికక్కడ అధికారులు వెంటనే వెంటనే చర్యలు తీసుకున్నప్పటికీ ట్రాఫిక్ మాత్రం ముందుకు కదల్లేరు. అర్ధరాత్రి వరకు వాహనదారులు రోడ్లపైనే జాగారం చేశారు.
హైటెక్ సిటీ నుంచి హయత్ నగర్ వరకు అటు గాజులరామారం వరకు ఇటు శంషాబాద్ వరకు ఎక్కడ చూసినా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓవైపు దంచి కొడుతున్న వాన మరోవైపు ముందుకు కదలని ట్రాఫిక్. నిజంగా ప్రయాణికులు బాధ వర్ణానాతీతం. రోడ్డుపై పారుతున్న వరద నీటిలో కొన్ని కార్లు కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రియల్ టైంలో పని చేసే అధికారులు కనిపించడం లేదని నెటిజన్లు ఫైర్ అయ్యారు. ఆఫీస్ నుంచి వచ్చే వాళ్లది ఒక బాధ అయితే ఆఫీస్‌కు నైట్ షిఫ్టులకు వెళ్లే వాళ్లది మరో బాధ. షిఫ్టు టైం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటోలు క్లిక్ చేసి చలానాలు రాసే డిపార్ట్మెంట్‌గా ట్రాఫిక్ విభాగం పేరు తెచ్చుకుందే తప్ప రియల్ టైంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడుతున్నారు. ఇలా వర్షంలో చిక్కుకుపోతామని ఆఫీసుల్లోనే వాహనాలు వదిలి మెట్రోను ఆశ్రయించిన వారికి అక్కడ క్రౌడ్ చూసి బిత్తర పోయారు. అన్ని మెట్రో టెర్మినల్స్‌లో కూడా భారీ క్యూలు కనిపించాయి. వచ్చిన మెట్రోలు కిక్కిరిసిపోయాయి. ఏదోలా ఇంటికో ఆఫీస్‌కో చేరుకోవాలన్న ఆశతో నగరవాసులు మెట్రోలో ఇబ్బందిపడుతూనే ప్రయాణం చేశారు. కనీసం నిలబడేందుకు కూడా జాగా లేక సమస్యలు ఎదుర్కొన్నారు.ప్రైవేటు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించే వారిది మరో బాధ. క్యాబ్‌లు, ఆటోలు గంటల తరబడి బుక్ కాలేదు. అయినా కొందరు డ్రైవర్ల వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. రిజెక్టు కొట్టారు. ఇలా అన్ని వైపుల నుంచి నగర వాసులను వాన తెగ ఇబ్బంది పెట్టేసింది.



**ఫొటోలు క్లిక్ చేసి చలానాలు రాసే డిపార్ట్మెంట్‌గా ట్రాఫిక్ విభాగం పేరు తెచ్చుకుందే తప్ప రియల్ టైంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడుతున్నారు. ఇలా వర్షంలో చిక్కుకుపోతామని ఆఫీసుల్లోనే వాహనాలు వదిలి మెట్రోను ఆశ్రయించిన వారికి అక్కడ క్రౌడ్ చూసి బిత్తరపోయారు.**

## 15 నుంచి స్త్రీశక్తి ప్రారంభం

**జయభేరి, విజయవాడ, ఆగస్టు 11:**

రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్ట్ 15 నుండి 'స్త్రీ శక్తి' పేరిట ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ ద్వారా స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేశారు. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఈ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ పథకం మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు వర్తించనుంది. ప్రయాణానికి ముందు సరైన గుర్తింపు కార్డు చూపించడం తప్పనిసరి. ప్రస్తుతానికి రాష్ట్రవ్యాప్తంగా 5 రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు.
పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఈ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం వర్తించదు: తిరుమలతిరుపతి మధ్య నడిచే సప్తగిరి బస్సులు, నాన్‌స్టాప్ సర్వీసులు, ఇతర రాష్ట్రాల మధ్య నడిచే అంతర్రాష్ట్ర బస్సులు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సులుబస్సుల్లో రద్దీ పెరగడం వల్ల అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు తీసుకుంటోంది. అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు, కండక్టర్లకు బాడీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించింది. అలాగే బస్టాండ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేలా ఆర్టీసీ ఎండీకి ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక హెల్ప్‌లైన్, లేదా ఆన్లైన్ పోర్టల్ ద్వారా త్వరలో తాజా వివరాలకు https://aptransport.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చుఏపీ ప్రభుత్వం మహిళల ప్రయాణ ఖర్చు తగ్గించడానికి ఎన్నికల హామీని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలపగా.. తాజాగా అందుకుగానూ మార్గదర్శకాలు సైతం జారీ అయ్యాయి. ఈ పథకం ద్వారా మహిళలకు ప్రయాణ ఖర్చులు తగ్గించడమే కాక, వారిలో ఆత్మవిశ్వాసం పెంచేలా చర్యలు తీసుకుంటోంది ప్రభుత్వం. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో అమలవుతున్న ఆర్టీసీ విధానాలను పరిశీలించిన తరువాతే కూటమి సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టింది.

## ఈసీ వర్సెస్ రాహుల్ గాంధీ

దాల్ మే కాలా అని భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) వ్యవహా ర శైలిని, పనితీరును కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తప్పుబడుతున్నారు. భారతీయ జనతా పార్టీకి లబ్ధి చేకూరే విధంగా గత కొద్ది సంవత్సరాలుగా ఈసీఐ ఎన్నికల నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్నదని రాహుల్ ఆరోపణ. గత లోక్‌సభ, మహారాష్ట్ర, హర్యా నా అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాహుల్ తరచుగా ఈసీఐని వేలెత్తి చూపుతున్నారు.కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని టార్గెట్ చేస్తూ కర్నాటకలో ఓట్ల చోరీపై చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే రాహుల్ గాంధీ ఆరోపణలపై మండిపడుతున్న ఎన్నికల సంఘం.. ఆయన్ను తన ఆరోపణలపై ప్రమాణం చేసి వివరాలు ఇవ్వాలని, లేదంటే దేశానికి క్షమాపణలు చెప్పాలంటూ ఉరుముతోంది. అయితే రాహుల్ స్పందించకపోవడంతో తానే స్వయంగా ఫ్యాక్ట్ చేసి వివరాలను విడుదల చేస్తోంది. ఇదే క్రమంలో రాహుల్ గాంధీ తాజాగా చేసిన ఓట్ల చోరీ ఆరోపణల్లో ఒకటైన బెంగళూరు వృద్ధురాలి ఓట్ల నమోదుపై ఇవాళ ఈసీ ఫ్యాక్ట్ చెక్ విడుదల చేసింది. శకునా రాణి అనే 70 ఏళ్ల మహిళ తొలిసారి ఓటు నమోదు చేసుకుందని, ఫామ్ 6ను దుర్వినియోగం చేసి ఒకే నెలలో రెండు ఓట్లు నమోదు చేయించుకుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం.. రాహుల్ ఆరోపణల్ని తోసిపుచ్చింది. తమ విచారణలో శకున్ రాణి రాహుల్ గాంధీ చెప్పినట్లు రెండుసార్లు కాదు, ఒక్కసారి మాత్రమే ఓటు వేసిందని తేలినట్లు ఈసీ పేర్కొంది. బెంగళూరులో ప్రజెంటేషన్ సందర్భంగా లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. శకున్ రాణి ఓటరు గుర్తింపు కార్డును వాడి రెండు ఓట్లు వేశారని, పోలింగ్ బూత్ అధికారి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టిక్ మార్కులు ఉన్న పత్రాన్ని చూపించారని ఆరోపించారు. అయితే, ఎన్నికల కమిషన్ తన 5 పాయింట్ల సమాధానంలో రాహుల్ చూపించిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసింది కాదని తేల్చేసిందిఆయన ఆరోపణలతో ఎన్నికల నిర్వహణ తీరుపై దేశ ప్రజల కున్న విశ్వాసం ప్రశ్నార్థకంగా మారింది.
బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం మహదేవపుర సెగ్మెంట్ ఎన్నికల జాబితాలో వున్న అవకతవకలను రాహుల్ రెండ్రోజుల క్రితం విలేకరులకు వివరించారు. 2024 ఎన్నికల్లో మిగతా సెగ్మెంట్ల కంటే మహదేవపురలో బీజేపీకి అనూహ్యం గా ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.ఒక గది ఉన్న ఇంటిలో పదుల సంఖ్యలో ఓటర్ల నమోదు, ఒకే ఓటరు పేరు పలు మార్లు నమోదు కావడం, ఓటర్ల ఫొటో లేకుండా, చిరునామా లేకుండా ఓటరు జాబితా తయారు చేయ డం డీకే ఓటరు పేరు పలు బూత్‌లలో దర్శనమీయడం వంటి అవకతవకల్ని రాహుల్ ఓటరు జాబితాను ముందుంచి ఎత్తిచూపారు. పోలింగ్ అధికారి ఇచ్చిన రికార్డుల ప్రకారం శకున్ రాణి రెండుసార్లు ఓటు వేసినట్లు మీరు చెప్పారని ఈసీ గుర్తుచేసింది. అయితే తమ అధికారులు నిర్వహించిన ప్రాథమిక విచారణలో మీరు ప్రజెంటేషన్‌లో చూపించిన టిక్ మార్క్ చేసిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసిన పత్రం కాదని తేలినట్లు ఈసీ ఫ్యాక్ట్ చెక్ లో పేర్కొంది. దీనిపై రాహుల్ గాంధీకి సంబంధిత పత్రాలు ఇవ్వాలని నోటీసు పంపినట్లు ఈసీ తెలిపింది. వీటి ఆధారంగా శకున్ రాణి లేదా మరెవరైనా రెండుసార్లు ఓటు వేశారో లేదో సమగ్ర విచారణ చేపట్టవచ్చని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ తన పార్టీ డిజిటల్ ఓటరు జాబితా, ఓటింగ్ బూత్ సీసీటీవీ ఫుటేజ్‌ను ఈసీ నుంచి కోరామని, కానీ వారు ఆ సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో తాము స్వంత దర్యాప్తు చేసామని, సమాచార హక్కు పిటిషన్లు దాఖలు చేసిన వివరాలు తీసుకున్నట్లు తెలిపారు. అందులో లభించిన ఆధారాలతో ఈసీ, బీజేపీ ఓట్లు దొంగిలించాయని ఆరోపించారు.మిగతా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతిలో ఎన్నికల కమిషన్ బీజేపీకి ప్రయోజనం చేకూర్చిందని, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే విధంగా ఈసీఐ వ్యవహరించి తక్కువ మెజారిటీతోనైనా, బీజేపీ గట్టెక్కేలా చేసిందని రాహుల్ ఆరోపణ.ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లలో తప్పులు వెరసి, భారత ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చతెచ్చేలా ఈసీఐ వ్యవహరించిందనే తీవ్ర ఆరోపణను ఆయన ముందుకు తెచ్చారు. బీహార్‌లో ఈసీఐ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఇప్పటికే వివాదాస్పదమైన నేపథ్యంలో రాహుల్ చేసిన విమర్శలు చర్చనీ యాంశంగా మారాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటింగ్ సమయం గడువుకు కొద్దిముందుగా ఓటర్లు బారులుతీరడం, అసలు మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించడం బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకేనని రాహుల్ వాదన. దీనిపై తీవ్రంగా స్పందించిన ఈసీఐ, ఆధారాలలో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. రాహుల్ చేసిన ఆరోపణల్లో పస లేదని ఈసీఐ బలంగా చెప్పే ప్రయత్నం చేస్తున్నది.ఈసీఐ అడిగినట్టుగా అఫిడవిట్ దాఖలు చేసినా, దానిపై సంతకం చేసేందుకు రాహుల్ భయపడుతు న్నారని ఇప్పుడు ఈసీఐ పరోక్షంగా ఆ ఆరోపణలు తప్పుల తడక అని చెప్పే ప్రయత్నమూ చేస్తున్నది. రాజ్యాంగ సంస్థలపై దాడి చేయడం రాహుల్‌కు మామూలేనని, ఇదీ దానిలో భాగమేనని బీజేపీ మంత్రులు, నాయకులు వెనువెంటనే స్పందించారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్టుగా, బీజేపీ గెలిస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగినట్టుగా రాహుల్ మాట్లాడుతుంటారని బీజేపీ నాయకులు కొట్టిపారేస్తున్నారు.

# జై కిసాన్ ఎత్తి పోతల ప్రాజెక్ట్ ని బాగు చేయాలనీ వినతి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కలిసిన ఆదివాసీ నవనిర్మాణ సేన... నాయకులు కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు
- ఆదివాసీ రైతులకు వ్యవసాయ బోర్లు త్రీ పేస్ కరెంట్ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు
- ఆదివాసీలు సాగులో ఉన్న భూములకు అసైన్మెంట్ చేయాలనీ కోరిన ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ని నియచాలని వినతి



**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 11 :**

ఎన్నో ఏళ్ల సాగు నీటి కష్టాలను తీర్చాలని ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో రైతులు తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ శాఖ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని పలు సమస్యల పైన హైదరాబాద్ లోని బూర్గుల రామకృష్ణారావు భవనం లోని తన కార్యాలయంలో సోమవారం కలిశారు. మొక్కజొన్న సాగు చేసి బహుళ జాతి కంపెనీల చేతిలో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించి నష్టపరిహారం ఇప్పించినందుకు కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు రైతుల తో పాటు కృతజ్ఞతలు తెలిపారు. నర్సింహా మూర్తి, నాగరాజు మాట్లాడుతూ.. విదేశీ విత్తనోత్పత్తి కంపెనీల చేతిలో మోస పోయిన రైతులకు ఐదు కోట్ల రూపాయలు నష్టపరిహారం ఇప్పించినందుకు గ్రామాల్లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని కోదండ రెడ్డికి తెలిపారు. నిజమైన రైతు ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని కొనియాడారు. వ్యవసాయ మంత్రి తుమ్మల, జిల్లా మినిష్టర్ సీతక్క మాకు న్యాయం జరిగేలా చేశారని రైతులు అన్నారు. ఉమ్మడి ఖమ్మం, ములుగు జిల్లాల్లో దశాబ్దాలుగా ఆదివాసీ రైతులు భూములను సాగు చేస్తూ ఉన్న వారికీ గత ప్రభుత్వాలు పట్టాలు ఇవ్వలేదని కోదండ రెడ్డి ముందు వాపోయారు. పట్టాలు లేక పోవడంతో ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రైతు భీమా, వ్యవసాయ రుణాలు అందడం లేదన్నారు. బ్యాంక్ రుణాలు కూడా రాకపోవడంతో దళారుల దెగ్గర అధిక వడ్డీలకు తెచ్చుకొని అప్పుల పాలు అవుతున్నారని తెలిపారు. అసైన్మెంట్ చేసి పట్టాలు ఇవ్వాలని ఆయన్ని కోరినారు. పాలెం వాగు కాలువకు విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయాలనీ విద్యుత్తు శాఖా వారిని ఇరిగేషన్ శాఖా వారిని ఆదేశించిచమని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు కోదండ రెడ్డిని కోరినారు. దీనివల్ల రాచపల్లి, నూగురు, ఒంటి మామిడి, చినగంగారం, జెల్లా కాలని, బర్లగూడెం, రామవరం, చిరుతపల్లి రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలోని రైతులకు ఉపయోగబడే విధంగా రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి జై కిసాన్ ఎత్తి పోతల పథకం ప్రారంభించారు అన్నారు. అది నేడు నిరపయోగంగా మారిందని అన్నారు. జై కిసాన్ ఎత్తి పోతల ప్రాజెక్ట్ ని బాగు చేయాలనీ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కోరిన వెంటనే సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. పోడు భూములకు బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వడం లేదని కూడా తెలిపారు. అన్ని సమస్యలను క్షుణ్ణంగా విన్న తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సంబంధిత అధికారులతో చర వాణి ద్వారా మాట్లాడినారు. ములుగు ఏజెన్సీ ఆదివాసీ రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారిణి చిత్ర మిశ్రా, ములుగు ఆర్ డిఓ వెంకటేష్ తో చరవాణి ద్వారా చర్చించగా.. తక్షణమే ఎస్సైన్మెంట్ సర్వే మొదలు పెట్టి పట్టాలు ఇస్తామని ఆర్ డిఓ వెంకటేష్ తెలిపారు. కొందండ రెడ్డి కలిసిన వారిలో రాచపల్లి, చిరుతహాపల్లి, రామవరం, యోగితానగర్ గ్రామాలకు చెందిన రైతులు శ్యామల గోపి, రాంబాబు, కుర్సం రాము, రైతులు ఉన్నారు.



## సెల్ఫోన్ దొంగ అరెస్ట్

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి పిఎస్ పరిధిలోగల భీమ్ రెడ్డి నగర్ లో నివసించే సలీం రోజులాగా తన పని నిమిత్తం బస్సు ఎక్కడానికి బస్ స్టాప్ లో సోమవారం ఉదయం 9 గంటలకు వేచి చూస్తుండగా ఇంతలో ఒక ఆర్టీసీ బస్సు ఎక్కబోతున్నంగా అందులోని ఒక వ్యక్తి తన పై జోబులో ఉన్న సెల్ ఫోన్ ను దొంగలిస్తుండగా వెంటనే అప్రమత్తమై అతి దొంగలు పట్టుకొని మేడిపల్లి పోలీస్ వారికి అప్పగించి ఇదే విషయంపై దరఖాస్తు ఇవ్వడం జరిగింది. కేసు నమోదు చేసుకొని సెల్ఫోన్ దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తి అయినా నరేష్ (20) ను విచారించగా తాను చెడు అలవాట్లకు బానిసై మొబైల్ ఫోన్లు దొంగలించి సోము చేసుకుంటునాడని తెలిపినాడు. ఇట్టి నేరస్థున్ని రిమాండ్కు తరలించడం జరిగింది. కావున ప్రజలు బస్సు ఎక్కేటప్పుడు తమ సెల్ ఫోన్ ను, విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాల్సిందిగా అని మేడిపల్లి పోలీస్ వారు సూచించడం జరుగుతుంది.

## ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లోని పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో జరిగిన ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశానికి. హాజరైన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో స్వాతంత్రం రాక ముందు దేశ స్వాతంత్రమే లక్ష్యంగా 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ లోని లక్నో నగరంలో ఏర్పడిన మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్ చరిత్రలో నిలిచిందని, దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతో మంది యువ కిషోరాలను బలిదానం చేసిన ఏకైక విద్యార్థి సంఘమని, నాటి నుంచి నేటి వరకు దేశ సమగ్రతపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావించి 90 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈనెల ఆగస్టు 12 తేది నుంచి 30వ తేది వరకు ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వార్షికోత్సవాలను విద్యార్థులు, అభ్యుదయవాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, సహాయ కార్యదర్శి ఎనమల సాయి, డివిజన్ సమితి సభ్యులు దాసరి శివ, కె భాను, ఎస్ వినయ్, పి మధు, ఎం అరవింద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపుర్గుగుల నిర్మూలన దినోత్సవం

- వాణి విద్యాని కేతన్ స్కూల్ చర్ల

**జయభేరి, చర్ల, ఆగస్టు 11 :**



చర్ల మండలం వాణి విద్యానికేతన్ స్కూల్లో సుమారు 200 మంది విద్యార్థులకు వాణి విద్యానికేతన్ ప్రిన్సిపల్ పద్మజ ఆధ్వర్యంలో ఐదు, ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు నులీ పురుగుల నివారణ మందు అందించడం జరిగింది. నులిపురుగుల నివారణ మందులు విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో పోషకాహార లోపం రక్తహీనత ఎదుగుదల సమస్యలు వస్తాయని ఈ సమస్యలు నివారించేందుకు ఆల్బెం డజోల్ మాత్రలు లేదా సిరప్ ఇవ్వబడుతుందని చెప్పారు ఒక సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు సిరప్ రూపంలో ఐదు సంవత్సరాల పైబడిన వారికి మాత్రల రూపంలో ఇస్తారని వివరించారు ఈ మాత్రలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి విద్యార్థులకు చదువులో ఏకాగ్రత పెరుగుతుందన్నారు పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అశ్రద్ధ వహించ కూడదు అని అన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడం చేతులు శుభ్రంగా కడుక్కోవడం బూట్లు ధరించడం వంటి అలవాట్లతో నులిపురుగులు రాకుండా తమని తాము కాపాడుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పటల్ నర్స్ ఆశా వర్కర్లు వాణి విద్యానికేతన్ స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలి

- ఆలుబాకలో రాస్తారోకో
- మండల వ్యాప్తంగా రోడ్లు నిర్మాణం చేయాలి

**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 11 :**




వెంకటాపురం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆలుబాక కేంద్రంగా రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి మాట్లాడుతూ సురవీడు, ఎదిర, అబ్బాయి గూడెం ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఆలుబాక ప్రభుత్వ పాఠశాలలోకి చదువుకోవడానికి వస్తుంటారు కానీ పాఠశాల సమయంలో బస్సులు లేక రోజుకు 80 నుంచి 100 రూపాయల వరకు ఖర్చు వస్తుంది. పేద విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక చదువుకోలేక ఖర్చులు పెట్టి రాలేకపోతున్నారని వాపోయారు. పాఠశాల కళాశాలలో బస్సు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. దానితోపాటు మండల వ్యాప్తంగా రోడ్ల నిర్మాణం చేయాలని గత పది రోజుల నుంచి పోరాటాలు చేస్తున్న గాని రోడ్లు వేయాలని నిమ్మకు నేరెత్తినట్టు అధికారులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలిపాక పాఠశాలలో ప్రారంభమైన అప్పటినుంచి ఇప్పటివరకు ఉపాధ్యాయులు లేక అధికారులకు ఎన్నోసార్లు తెలియజేసిన గాని పట్టి పట్టినట్టు చూస్తున్నారని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారం కాకపోతే సమస్యలు పరిష్కారం అయ్యేవరకు భవిష్యత్తులో పోరాటాలు దీక్షలు పెడతామని అన్నారు. సమస్య పరిష్కారం కానీ ఎడల పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సోడి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి నర్సింగరావు, కొరస వంశీ తదితరులు పాల్గొన్నారు.

## టర్కీలో భూకంపం.. 16 భవనాలు నేలమట్టం

- రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదు

**జయభేరి, ఇస్తాంబుల్ ఆగష్టు 11:**



టర్కీని భూకంపం వణికించింది. బలికెసిర్ ప్రావిన్సులో ఆదివారం సాయంత్రం భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదైంది. ఈ భూకంప తీవ్రతకు 200 కిలోమీటర్ల దూరంలోని ఇస్తాంబుల్‌లోనూ భూమి కంపించింది. భూకంపం ధాటికి సిందిర్గి పట్టణంలో దాదాపు 16 భవనాలు నేలమట్టం అయ్యాయి. శిథిలాల కింద చిక్కుకుని 29 మంది తీవ్రంగా గాయపడగా, ఓ యువతి ప్రాణాలు కోల్పోయింది. శిథిలాలను తొలగించేందుకు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. టర్కీ తరుచూ భూకంపాల ప్రభావానికి గురవుతుంది. టర్కీలో 2023 ఫిబ్రవరిలో సంభవించిన భూకంపం.. బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. 53 వేల మంది బలయ్యారు. పురాతన నగరం ఆంటియోక్ సర్వనాశనమైంది. గత నెల జులై మొదట్లో కూడా 5.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ సమయంలో ఒకరు మరణించగా, 69 మంది గాయపడ్డారు.



## జాతీయ నులి పురుగులు నివారణ దినోత్సవానికి ఏర్పాట్లు పరిశీలన

**జయభేరి, పరవాడ:**

ఈ 12వ తేదీ అనగా మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మరియు అంగన్వాడి స్కూల్ ని స్టేట్ నుండి వచ్చే బృందం డాక్టర్.ఎస్.ఎస్. సౌందర్య, డాక్టర్. బి. సుజాత పరిశీలన చేసి మంగళవారం జరగబోయే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం ఏ విధంగా అమలు చేస్తున్నారు అని ప్రతి పాఠశాలలో ఐ.ఇ.సి మెటీరియల్ ప్రదర్శన చేసిన విధానము పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరం నుండి 2 సంవత్సరాలు ఆఫ్ టాబ్లెట్ , మిగతా వయసు వారికి అందరికీ ఒక మాత్ర వెయ్యాలని అందుబాటులో లేనివారు మరుసటి రోజు వెయ్యించుకోవొచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. హారిక, డాక్టర్. జయశ్రీ కరిష్మా. పీ.హెచ్.ఎన్. జానికి రామన్, సూపర్వైజర్స్ ఎమ్మెస్ ప్రసాద్. పి.వి రత్నం, పాల్గొన్నారు.

## మొల్లోడు గెడ్డలో రసాయన వ్యర్థ జలాలను తొలిగించాలి

- రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గని శెట్టి డిమాండ్



**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలో శుద్ధిచేసి సముద్రానికి పంపించవలసిన వ్యర్థ రసాయన జలాలను సి ఈ టి పి నుండి నేరుగా మొల్లోడు గడ్డలోకి విడుదల చేస్తున్న రాంకి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మొలోడుగడ్డలో వ్యర్థ రసానికి జలాలను ఆయన పరిశీలించారు. ఇప్పటికే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రాంకీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని అన్నారు. వెంటనే వ్యర్థ రసాయన జలాలను మొల్లోడు గెడ్డ డి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యం ల్యాండ్ ఫిల్ నిండిపోవడంతో ఘన వ్యర్థాలను కూడా కోస్టల్ వేస్ట్ మేనేజ్మెంట్ లో బహిరంగ ప్రదేశంలో వేసి వేయడం వలన ఈ ప్రాంతం భూగర్భ జలాల నాశనం అవడంతో పాటు పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని వెంటనే రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని తానం పక్కన అక్రమంగా చెరువు తవ్వకాలు చేసి వ్యర్థ జలాలు నిల్వ చేయడానికి ప్రయత్నించారని పరవాడ, భరిణికం, తానం,తాడి, లంకెలపాలెం,ఈ బోనంగి, సాలాపువాని పాలెం చుట్టూ ఉన్న గ్రామాలు తీవ్ర కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని గని శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు నడుస్తుందని ఒకవైపు కేసు నడుస్తున్న రాంకీ యాజమాన్యం బరితెగించి అక్రమాలకు చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం నేతలు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని రాంకీ యాజమాన్యానికి భజన చేసే కార్యక్రమాలకు స్వస్తి పలకాలని అన్నారు.

## మానవత్వం చాటుకున్న రమావత్ రమేష్ నాయక్



**జయభేరి, దేవరకొండ :**

చందంపేట మండలం రేకుల గడ్డ గ్రామానికి చెందిన బొమ్ము మంగమ్మ రాఖీ పండగ సందర్భంగా తన పుట్టింటికి వెళ్లే సందర్భంలో అంగడిపేట లో తన పర్సును పోగొట్టుకోవడం జరిగింది. అదే సమయంలో అంగడిపేట లో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామావత్ రమేష్ నాయక్ పరుసును చూసి తీసుకొని అందులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా అడ్రస్ తెలుసుకొని రేకుల గడ్డ గ్రామానికి చెందినటువంటి వారికి సమాచారం ఇచ్చి దేవరకొండ లోని తన నివాసం వద్ద బొమ్మ మంగమ్మను పిలిపించుకొని తన పరుసును అందులో ఉన్న డబ్బును అందించి తన మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మ మంగమ్మ తన సంతోషాన్ని వ్యక్తపరుస్తూ నేను పోయినా అనుకున్న డబ్బులు తిరిగి ఇచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలపడం జరిగింది.

## మంత్రి కందులతో నిర్మాతలు భేటీ

**జయభేరి, విజయవాడ:**

మంత్రి కందుల దుర్గేశ్‌తో నిర్మాతల భేటీ ముగిసింది. ఇండస్ట్రీకి చెందిన 14 మంది ప్రముఖ నిర్మాతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సినీ కార్మికుల సమస్యలు, ఫిల్మ్ ఫెడరేషన్ సమ్మె, షూటింగ్స్ నిలిచిపోవడం వంటి విషయాలు మంత్రికి వివరించినట్లు సమాచారం. మరోవైపు ఈ భేటీ అనంతరం నిర్మాత విశ్వప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రితో భేటీలో కార్మికుల సమస్య గురించి ఎలాంటి ప్రస్తావన రాలేదని వెల్లడించారు. కేవలం సినీ పరిశ్రమ అభివృ.ద్ధిపై చర్చించినట్లు తెలిపారు.

# రైతులను బలోపేతం చేసే దిశగా పటిష్ట చర్యలు

- గ్రీన్ ఎనర్జీ పాలసీ క్రింద పెద్దపల్లి జిల్లాలో పి.ఏ.సి.ఎస్ ద్వారా 4 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి
- 4 నెలల కాలంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ పనులు పూర్తి
- మంథని మండలం గుంజపడుగు గ్రామం వద్ద 2 కోట్ల 90 లక్షల రూపాయలతో పీఎం కుసుమ్ ద్వారా ప్యాక్స్ ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేసిన రాష్ట ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి. శ్రీధర్ బాబు

**జయభేరి, మంథని, ఆగస్టు-11:**



రైతులను బలోపేతం చేసే దిశగా సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు. సోమవారం మంథని ప్రాంతంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, కరీంనగర్ డిసిసిబి చైర్మన్ రవీందర్ రావు లతో కలిసి మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వేరు హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 7 కోట్ల రూపాయలతో 5 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న రెండు గోదాములకు, గుంజపడుగు గ్రామంలో 2 కోట్ల 90 లక్షల రూపాయలతో పీఎం కుసుమ్ ద్వారా ప్యాక్స్ ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని ఆధ్వర్యంలో గుంజపడుగు శివారులో పి.ఎం కుసుమ్ క్రింద 3.5 కోట్ల రూపాయలతో 1 మెగా వాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మన పెద్దపల్లి జిల్లాలో నంది మేడారం, కాల్వ శ్రీరాంపూర్, అప్పన్న పేట, మంథని ప్రాంతాలలో 1 మెగా వాట్ చొప్పున ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 4 నెలల కాలంలో ఈ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం, గ్రిడ్ కనెక్షన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. చిల్లపల్లి గ్రామంలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము లను 7 కోట్ల రూపాయలతో చేపట్టామని అన్నారు. గుంజపడుగు ప్రాంతంలో సహకార బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆర్.బి.ఐ కు పంపాలని మంత్రి సూచించారు. సహకార శాఖ లో 20 సంవత్సరాల కాలంగా తన వంతు కృషి చేస్తున్న కరీంనగర్ డిసిసిబి చైర్మన్ కు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే రైతు సోదరులకు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాలతో పాటు అనుబంధ రంగాలైన గోదాముల నిర్మాణం, పి.ఏ.సి.ఎస్ ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు నువ్వంటే కార్యక్రమాల వల్ల రైతులను బలోపేతం చేయడం జరుగుతుందని అన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల అమలులో స్థానిక ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ గౌడ్, మంథని మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వెంకన్న,ఆర్.డి.ఓ. సురేష్, సహకార సంఘ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## 45 వేల రూపాయల విలువచేసే స్పోర్ట్స్ డ్రెస్ ల బహుకరణ

**జయభేరి, గుడిపల్లి :**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడిపల్లి విద్యార్థినీ విద్యార్థులకు శీలం నారాయణ రెడ్డి రిటైర్డ్ పి ఈ టి 45 వేల రూపాయల విలువచేసే స్పోర్ట్స్ డ్రెస్ లను మొత్తము 110 మంది విద్యార్థులకు బహుకరించడం జరిగింది . నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటే తమ యొక్క లక్ష్యాలను సాధించవచ్చు అని తెలియజేయడం జరిగింది అనంతరం శీలంనారాయణరెడ్డి ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు MEO సముద్రాల శ్రీనయ్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శీలం నారాయణ రెడ్డి కుమారుడు విజయ శేఖర్ రెడ్డి మాజీ సర్పంచ్ శీలం శేఖర్ రెడ్డి గ్రామ పెద్దలు బోయ సుధాకర్ రెడ్డి ఏఏపిసి చైర్మన్ కొమ్ము బక్కమ్మ గారు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాంపురం, కడేకల్ గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం




**జయభేరి, వాజేడు, ఆగస్టు 11 :**

ములుగు జిల్లా వాజేడు పోలీస్ సర్కిల్ పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రాంపురం, కడేకల్ గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ –'అభయ మిత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామీణ యువత విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు సాగాలని, దుర్వ్యసనాలకు బానిసలు కాకుండా బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవా లని సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం ముగింపులో యువతకు వాలీబాల్ కిట్లను ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ పంపిణీ చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో దుశ్చర్యల పై పోలీసులు విచారణ ప్రారంభం



**జయభేరి, ఫరూక్‌నగర్ :**

ఫరూక్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మళ్లీ విధ్వంసానికి పాల్పడిన ఘటన గ్రామంలో ఆగ్రహానికి దారితీసింది. శనివారం, ఆదివారం సెలవులు కావడంతో, ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తాళం పగులగొట్టి, ఫ్యాన్లను ధ్వంసం చేసినట్లు సమాచారం. గత నెల రోజుల క్రితం కూడా ఇదే విధంగా పాఠశాల ఫ్యాన్లు, కిటికీలు, రికార్డులు ధ్వంసం చేసిన ఘటన చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు, విద్యావంతులు ఈసారి పోలీసులకు సమాచారం ఇచ్చరు. విద్యాసంస్థలపై ఇలాంటి చర్యలు తీవ్రంగా ఖండనీయమని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. నిందితులను గుర్తించి, కఠిన శిక్షలు విధించాలనే డిమాండ్ తల్లిదండ్రులు, విద్యార్థుల నుండి వ్యక్తమవుతోంది. సమాచారం అందుకున్న షాద్‌నగర్ పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న కొందరు యువకులపై గ్రామస్తులు సమాచారం ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. గ్రామ సెక్రటరీ, పెద్దలు యువ నాయకులు తదితరులు ఈ పరిశీలనలో పాల్గొన్నారు. పోలీసులు నిందితులను త్వరలోనే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా

- విజయపురి కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఏర్పాటు




**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మునిసిపాలిటీ పరిధిలోని చౌదరిగుడా విజయపురి కాలనీలో విజయపురి కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా దోర్నాల సంతోష్, ప్రధాన కార్యదర్శిగా ఎన్ భాను కుమార్ గౌడ్, కోశాధికారిగా గడ్డం నరేష్ , ఉపాధ్యక్షుడిగా రాజు రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ప్రకాష్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజేష్ తదితరులను ఎన్నుకున్నారు. వీరితోపాటు శంకర్, ప్రవీణ్, పవన్, బిక్కు నాయక్ సురేష్ శ్రీకాంత్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నుకున్నారు. షేక్ మీరా, వెంకటేష్, ప్రతాపరెడ్డి, నాయక్, శ్రీధర్, దిగంబర్ లను గౌరవ సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు శాలువాలతో సత్కరించారు.

## సమయపాలన పాటించని కాలేజ్ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ నిబంధన ప్రకారం స్థానికంగా ఉండని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి
- సమస్యలతో సతమతమవుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కలెక్టర్ పర్యటన చేయాలి

**జయభేరి, చర్ల, ఆగస్టు 11 :**



చర్ల మండలంలో బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా చర్ల మండలం అధ్యక్షులు కొట్టే నవన్ హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ లోని విద్యార్థులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని జిల్లా కలెక్టర్ తక్షణమే ఈ కాలేజీలో పర్యటించి కాలేజీలో ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు కాలేజీలో ఉన్న ఉపాధ్యాయుల్లో సగానికి పైగా ఎవరూ కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని స్థానికంగా ఉండడం లేదని ఇష్టానుసారంగా సమయపాలన పాటించకుండా వస్తున్నారని క్లాసుల్లో సెల్ఫోన్లు మాట్లాడుతున్నారని ఉపాధ్యాయులు గొడవలు పెట్టుకుంటూ రెండు మూడు గ్రూపులు పెడుతున్నారని వారి గ్రూపు రాజకీయాల్లో భాగంగా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు కాలేజీ పరిశుభ్రంగా లేదని దాని ద్వారా దోమలు ఇప్పుడు మీ కీటకాలు ఖాళీగా ఆవరణలో విశా జీవులు తిరుగుతున్నాయని తక్షణమే కాలేజీ పరిసర ప్రాంతాలని శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. కాలేజీ గ్రాండ్స్ ఉన్నప్పటికీ పెయింటింగ్ కూడా చేసినటువంటి పరిస్థితి లేదని తెలిపారు తక్షణమే పై ఉన్నతాధికారుల స్పందించి కాలేజీని బాగుపరచాలని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా వివరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనియెడల కచ్చితంగా బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల ఉపా అధ్యక్షు ml నారాయణ, నీలం సంతోష్, కట్ట రాజేష్, జంజీరాల సుజిత్, మరియు ధనుష్ తదితరులు పాల్గొన్నారు.



## దొంగ అరెస్టు .. 77 గ్రాముల బంగారం స్వాధీనం

**జయభేరి, సికింద్రాబాద్:**

చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న ఘరానా దొంగను అరెస్ట్ చేసిన సికింద్రాబాద్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు నిందితుడి నుండి 7.70లక్షల విలువైన 77గ్రాముల బంగారం స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. జీడిమెట్ల లో నివాసం ఉంటూ హెటెరోలో ఉద్యోగం చేస్తున్న కాకినాడకు చెందిన కొరిప్రోలు లవరాజు (23) చేడు వ్యాసనాలు, జల్సాలు, బెట్టింగులకు అలవాటు పడి దొంగతనాలు ప్రవృత్తిగా మార్చుకున్నాడని జీఆర్పీ డీఎస్పీ జావేద్ తెలిపారు. అందులో భాగంగా రద్దీగా ఉన్న సింహపురి ఎక్స్ ప్రెస్, గౌతమి ఎక్స్ ప్రెస్ రైళ్లలో దొంగతనాలకు రెండు చైన్ స్నాచింగ్ లకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించి 77గ్రాముల బంగారం స్వాదినం చేసుకున్నట్లు వెల్లడించారు.

## వీధుల్లో ఒక్క కుక్క ఉండకూడదు.. వెంటనే షెల్టర్లకు తరలించండి

- వీధి కుక్కలను షెల్టర్లకు తరలించమని సుప్రీంకోర్టు ఆదేశం

**జయభేరి, ఢిల్లీ :**



దేశ రాజధాని ఢిల్లీలో కుక్క కాటు కేసులు పెరిగిపోతున్న వేళ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత త్వరగా డాగ్ షెల్టర్లు ఏర్పాటు చేసి వాటిని తరలించాలని సూచించింది. ఏదైనా సంస్థ లేదా వ్యక్తులు వీధి శునకాలను తీసుకెళ్లకుండా అడ్డుకుంటే తదుపరి చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. వీధి కుక్కల బెడద చాలా దారుణంగా ఉందన్న సుప్రీంకోర్టు, ప్రజా ప్రయోజడనాలు దృష్టిలో పెట్టుకుని ఈ ఆదేశాలను జారీ చేస్తున్నట్లు పేర్కొంది.

ఢిల్లీ ప్రభుత్వం సహా స్థానిక యంత్రాంగాలు కలిసి ఈ డాగ్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ డాగ్ షెల్టర్లలో తగినంత సిబ్బందిని ఉంచి స్టెరిలైజేషన్, ఇమ్యునైజేషన్ ప్రక్రియలను సత్వరమే చేపట్టాలని నిర్దేశించింది. పరిస్థితి చాలా భయంకరంగా ఉందన్న సుప్రీం, తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అన్ని వీధుల నుంచి శునకాలను వెంటనే తీసుకెళ్లడం ప్రారంభించాలని సూచించింది. అయితే ఈ ప్రక్రియ ఎలా నిర్వహించాలో అధికారులు నిర్ణయించుకోవచ్చని సూచించింది. వాటిని తిరిగి వీధులు, కాలనీలలో విడుదల చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వీధి శునకాలను తీసుకెళ్లకుండా ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. శిశువులు, చిన్నారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వీధికుక్కల బారిన పడకూడదని పేర్కొంది.

దేశంలో వీధి కుక్కల బెడదపై మీడియాలో వచ్చిన కథనాలకు సుప్రీంకోర్టు స్పందించి, ఈ అంశాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారణను చేట్టింది. అయితే ఈ విషయంపై కేంద్ర నుంచి మాత్రమే వాదనలు వింటామని జంతు ప్రేమికులు లేదా మరే ఇతర పార్టీ నుంచి వచ్చిన పిటిషన్లనపై విచారించలేమని స్పష్టం చేసింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఆదేశాలను జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది.

**'వారి ప్రాణాలను తిరిగి తీసుకువస్తారా?'**

వీధికుక్కల తరలింపు ప్రదేశాలపై జస్టిస్ పార్దివాలా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయాన్ని కోరారు. అందుకోసం ఇప్పటికే ఓ ప్రదేశాన్ని గుర్తించారని తెలిపారు. అయితే, జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ పొందడం వల్ల అది నిలిచిపోయిందని వివరించారు. దీంతో ఆగ్రహించిన ధర్మాసనం రేబిస్తో చనిపోయిన వారని జంతు ప్రేమికులందరూ కలిసి తిరిగి తీసుకురాగలుతారా? అంటూ ప్రశ్నించింది. వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా ఎవరికీ అనుమతి ఇవ్వొద్దని అన్నారు. కుక్కల కోసం వెంటనే షెల్టర్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా అనుమతించబోమని కూడా పేర్కొంది. కుక్క కాటు కేసులను నివేదించడానికి వారంలోపు ఒక హెల్ప్లైన్ను ప్రారంభించాలని పౌర అధికారులకు సూచించింది.

## మైనర్ బాలికతో నాలుగో పెళ్లి...

- కానిస్టేబుల్ పై కేసు

**జయభేరి, నల్గొండ, ఆగస్టు 11:**

సూర్యాపేట జిల్లాలో ఓ పోలీస్ కానిస్టేబుల్ నిత్య పెళ్లి కొడుకుగా మారాడు. అవకాశం దొరికితే చాలు పెళ్లి పీటలు ఎక్కుతున్నాడు. ఓ మైనర్ బాలికను సైతం కానిస్టేబుల్ వివాహం చేసుకోవడంతో కథ అడ్డం తిరిగింది. ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కృష్ణంరాజు ఇప్పటి వరకు నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో మూడవ వివాహం ఏడాది కిందట సూర్యాపేట మండలానికి చెందిన ఓ మైనర్ బాలికతో జరిగినట్టు తెలుస్తోంది. ఈ విషయం ఇటీవల సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. బాలిక ప్రస్తుతం సూర్యాపేట పట్టణంలో నివసిస్తున్నట్టు సమాచారం. బాలికతో పెళ్లి జరిగినట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ దృష్టికి రావడంతో ఆయన విచారణకు ఆదేశించారు. మునగాల సీఐ రామకృష్ణారెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. ఆయన బాలిక నివాసానికి వెళ్లి వివరాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఇక కృష్ణంరాజుపై ఇదే మొదటిసారి ఆరోపణలు కాదు. గతంలో తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో ఇసుక వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేశారు. అనంతరం ఆయనను నడిగూడెం స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన సూర్యాపేట కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా మైనర్ బాలికతో వివాహం నిబంధనలకు విరుద్ధమని, దీనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసేందుకు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మూడు రోజుల నుంచి సోషల్ మీడియాలో మైనర్ బాలికతో వివాహం వ్యవహారం వైరల్ కావడంతో కానిస్టేబుల్ కృష్ణంరాజు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

# మెరుగైన విద్యను అందించడమే కావేరి యూనివర్సిటీ లక్ష్యం

- పోటీ ప్రపంచంలో సత్తా కనబర్చిన వారిదే చక్కటి భవిష్యత్తు
- కావేరి యూనివర్సిటీ ఛాన్సలర్ భాస్కరరావు




**జయభేరి, గజ్వేల్, ఆగస్ట్ 11 :**

ఉన్నత విలువలు, నాణ్యత ప్రమాణాలతో కూడిన మెరుగైన విద్యను అందించడమే తమ లక్ష్యమని కావేరి యూనివర్సిటీ ఛాన్సలర్ భాస్కరరావు పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గౌరారం శివారులోని కావేరి యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైస్ ఛాన్సలర్ ప్రవీణ్ రావుతో కలిసి ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సత్తా కనబర్చిన వారిదే చక్కటి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.

అయితే అందివచ్చిన ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాన్ని వెలికి తీస్తూ ప్రపంచ స్థాయిలో పోటీ పడాలని పిలుపు నిచ్చారు. అలాగే అంతరించిపోతున్న మానవ విలువలను కాపాడుతూ సమాజ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అయితే డబ్బు సంపాదన కాకుండా సేవాభావంతో ముందుకు సాగాలని, అదే సంకల్పంతో కావేరి యూనివర్సిటీ ముందుకెళ్తూ గ్రామీణ ప్రాంతాలలోని 20 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని ఉచిత విద్యా బోధన, భోజన సదుపాయం కల్పిస్తూ ప్రతి ఏటా రూ 6 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రపంచం, సమాజం గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. వివిధ రంగాలలో ప్రపంచ స్థాయి నిష్ణాతులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన అందిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేస్తామని వైస్ ఛాన్సలర్ ప్రవీణ్ రావు స్పష్టం చేశారు. శాస్త్రవేత్త అబ్దుల్ కలాం బాటలో నడవాలని కాంక్షిస్తూ దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతిక నైపుణ్యం అందిపుచ్చుకొని చక్కటి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచుకోవడంతో పాటు పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదగాలని అన్నారు.



దేశంలోనే మొదటి అగ్రిటెక్ యూనివర్సిటీ కావేరి యూనివర్సిటీ కాగా, విద్యార్థులు ఉన్నత లక్ష్యసాధనలో ముందుండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధిపతులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ తిరుమల రావు, డాక్టర్ పవన్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ ప్రతాప్ కుమార్ రెడ్డి, వంశీధర్, మిథున్ చంద్, సీఐ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ప్రధాన రహదారి నీ పరిశీలించిన ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**

వర్షంతో ఉప్పల్ ప్రధాన రహదారి గుంతలు పడి అతలాకుతలం కావడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రోడ్డు నీ పరిశీలించారు. గుంతలను పుడ్చి వేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ,మహాసభల గోడపత్రిక విడుదల



**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ, మహాసభల గోడపత్రిక ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలో విడుదల చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ, మహాసభలో 2025,ఆగస్టు 19 నుంచి 22 వరకు మహారాజా గార్డెన్, గాజులరామారం షాపూర్ నగర్, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో మహాసభలు జరుగుతాయని తెలియజేశారు. ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్రం నుంచి 1000 మంది ప్రతినిధులు పాల్గొని 4 రోజులు ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను నిర్ణయిస్తారు. భారతదేశంలో 100 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ దేశంలో మతసామరస్యం కోసం లౌకిక రాజ్యం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీగా ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బాపిరాజు, బికేఎంయు మండల కార్యదర్శి కె మహాలక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు ఇస్తారి, సోమరాజు, సిహెచ్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణకు మందుల పంపిణీ

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి



**జయభేరి, ఉప్పల్ ;**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 119పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఉప్పల్‌లో కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం ఉప్పల్‌లోని mpps, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను రజితాపరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పరాన్నజీవుల ఇన్ఫెక్షన్ రేటును తగ్గించవచ్చని ఈ సందర్భంగా రజితాపరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. పేగు పురుగుల నిర్మూలన చేయవచ్చన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని 119 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేస్తున్నట్టుగా చెప్పారు. ప్రతి బిడ్డను నులిపురుగుల రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఎంలు వనమాల, పాఠశాల హెచ్ ఎం. హ్యారిసింగ్ రాథోడ్, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి,ప్రేమ్, దూద భాస్కర్, విజయ్ అన్వర్, మహంకాళి రాజు, విజయ్ కుమార్,బాకారం అరుణ్, రంగుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.





## ఉప్పల్‌లో వరంగల్ రహదారి నిర్మాణం, మరామ్మతు..

- బాధ్యతలను జీహెచ్ఎంసీకి అప్పగించండి
- ఎలివేటెడ్ కారిడార్‌తో ఉప్పల్ మార్గం అధ్వాన్నంగా మారింది
- మంత్రి వెంకట్‌రెడ్డిని కోరిన పరమేశ్వర్‌రెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్‌నారపల్లి వరకు చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగంగా సాగడం లేదని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పనులు చేపట్టి ఏడు సంవత్సరాలు అయినప్పటికీ ఎక్కడి పనులు అక్కడనే ఉన్నాయన్నారు. ఈ పనుల కారణంగా ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారి తీవ్రంగా దెబ్బతిని అధ్వాన్నంగా తయారయి నిత్యం రాకపోకలకే కాకుండా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. వరంగల్ జాతీయ రహదారి కావడంతో ప్రతిరోజూ వేలాది మంది నివాసితులు, ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు ఈ మార్గం గుండానే రాకపోకలను రాగిస్తున్నట్టుగా చెప్పారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలు పడి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. సోమవారం పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారి పరిస్థితి దారుణంగా తయారు అయిందన్నారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ రింగురోడ్డు నుంచి నల్లచెరువు వరకు రహదారి నిర్మాణం లేదా మరామ్మతు పనులను జీహెచ్ఎంసీ చేసేలా ఆర్ అండ్ బీ నుంచి ఎన్ఓసీ ఇప్పించాలని పరమేశ్వర్‌రెడ్డి కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో పాటు వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు ఫోన్ చేసినట్టుగా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. కారిడార్ విషయాన్ని పక్కన పెట్టి వెంటనే రోడ్డు నిర్మాణం, కావాల్సిన మరమ్మతులను చేపట్టాలని ఆదేశించారని పరమేశ్వర్‌రెడ్డి చెప్పారు.

## కోడి కోసం కొట్లాట

- వ్యక్తి హత్య
- మోహన్ అనే వ్యక్తిపై దాడి చికిత్స పొందుతు మృతి.
- ఈనెల మూడో తేదీన రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ
- చికిత్స పొందుతూ ఈనెల తొమ్మిదిన మృతి చెందిన మోహన్
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు రిమాండ్

**జయభేరి, వికారాబాద్ :**

వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం రాంపూర్ లో ఘటన రాంపూర్ గ్రామంలో మోహన్ కోడి శంకర్ ఇంటి వైపు వెళ్ళింది ఆ తర్వాత కోడి కనిపించకపోవడంతో కోడి ని శంకర్ చంపేశాడని అనుమానించిన మోహన్ శంకర్ తో గొడవపడ్డాడు మాట మాట పెరగడంతో శంకర్ మరియు అతని భార్య లక్ష్మీబాయి కుమారుడు రాజేష్ ముగ్గురు కలిసి మోహన్ పై దాడి చేయడంతో మోహన్ చికిత్స పొందుతూ మృతి మోహన్ కుటుంబ సభ్యులు దారూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో శంకర్ అతని కుమారుడు రాజేష్ భార్య లక్ష్మీబాయి పై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు. ఈ గిరిజన కుటుంబాలలో పాత కక్షలు ఉన్నట్టు సమాచారం.

## ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి

- అమరం మోహన్ రెడ్డి
- 75 అడుగుల జాతీయ జెండాతో తీరంగా ర్యాలీ



**జయభేరి, మేడ్చల్ :**

ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావం పెంపొందినప్పుడే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మేడ్చల్ జిల్లా బీజేపీ నాయకుడు అమరం మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తీరంగా పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ ర్యాలీలో 75 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ విద్యార్థులు లక్ష్మీనారాయణ దేవాలయం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీ అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ అందరిలో దేశం నాది అనే భావన జాగృతం అయినప్పుడు దేశం బాగుంటుందని, ఇలాంటి ర్యాలీలతో ప్రజలలో దేశం పట్ల జాతీయ భావన కలుగుతుందన్నారు.



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయలని మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. పహల్గమ్ దాడి తరువాత ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రత్యర్థి స్థావరాలను ముట్టిబెట్టిన తరువాత దేశ ప్రజల ఐక్యత అభినందనియం అని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ముదిరాజ్, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు కృష్ణ గౌడ్, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతి, ప్రధాన కార్యదర్శుల కృష్ణ, రామారావు, బీజేపీ నాయకులు కిషన్, శ్రీకాంత్, వెంకటేష్, సత్యనారాయణ, చెంచాల సురేష్, విక్రమ్, నాగరాజ్, నరేష్, నవీన్, ప్రవీణ్, అభిలాష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బట్టికాడి నవనీత, యువమోర్చ నాయకులు శాంతన్ రెడ్డి, శ్రవణ్,యువజన సంగం నాయకులు, స్కూల్ విద్యార్థులు మున్సిపల్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజన కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలి

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం వాడ చీపురుపల్లి స్కూల్లో మధ్యాహ్నం భోజనం కార్మికులు కనీసం వేతన అమలు చేయాలని ఆ మండల ఎండిఎం అధ్యక్షులు కే ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆవిడ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం కార్మికులు 18 సంవత్సరాల నుంచి స్కూల్లో వంట చేస్తున్నారని ఒక్క వంట మనిషికి మూడు వేలు జీతం వస్తుందని జిల్లాలో అన్ని స్కూలు పరిస్థితి ఇలానే ఉందని మహిళలలు బయటికి పోయి పని చేసుకుంటే ఒక్క మనిషికి 600 రూపాయలు వస్తున్నాయి అని అన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని కార్మికులు యందు దయ ఉంచి కనీసం జీతం ఒక్కొక్కరికి పదివేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాము అని అన్నారు వాడు చీపురుపల్లి స్కూల్లో 450 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి 150 గ్రాములు బియ్యం ఒక గుడ్డు ప్రభుత్వం ఇస్తుంది మిగతా ఖర్చులన్నీ ముందుగా పెట్టుబడి పెట్టి కందిపప్పు ఆయిల్ గ్యాస్ కూరగాయలు పోపులు ఆకుకూరలు ఇవన్నీ కార్మికులే కొన్ని ఉండి పెడుతున్నారు అంటే ఎంత దారుణంగా మధ్యాహ్నం భోజనం కార్మికులు పరిస్థితి ఉన్నదో ఈ కూటమి ప్రభుత్వం అర్థం చేసుకోవాలని డ్యూపుటి సీఎం పవన్ కళ్యాణ్ ఏ మహిళ ఎక్కడ ఇబ్బంది పడిన నేను నిలబడతాను అని ఆనాడు పిలిపునిచ్చారాని కూటమిప్రభుత్వం వెంటనే మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల డిమాండేలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం మండల గౌరవ అధ్యక్షులు పి మాణిక్యం,కె ఆదిలక్ష్మి, జి లక్ష్మి, కే రత్నకుమారి, పి నాగమణి,గాజుల సత్యవతి, కే పైడితల్లి, ఏ నూక రత్నం,కే లక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



# డీ ఏ ఓ రైతుల సంక్షేమానికి కృషి చేశారు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి ;**

జిల్లా వ్యవసాయ అధికారి వీరు నాయక్ మరణం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వీరు నాయక్ సంతాప సభ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురైన వీరునాయక్ నెల రోజుల నుండి హైదరాబాద్ లోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారని తెలిపారు.వీరు నాయక్ నిజాయితీ గల అధికారి అని, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన మంచి అధికారిని కోల్పోయామని అన్నారు. వీరునాయక్ సేవలు వ్యవసాయ రంగానికి ఎంతో మేలు కలిగించాయన్నారు. ఆయన మృతి వ్యవసాయ శాఖకు తీరని లోటని పేర్కొంటూ వీరు నాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తూ జిల్లా యంత్రాంగం తరపున వీరునాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ఇంఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా ఇంచర్లలో పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు

- 12 ఎకరాల భూమి కేటాయించిన ప్రభుత్వం
- శంకుస్థాపన చేసిన మంత్రులు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి సీతక్క.



**జయభేరి, ములుగు :**

దేశంలో వంట నూనెల లోటును పూడ్చేందుకు ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహించి అనేక రాయితీలు కల్పించడంతో వేలాది ఎకరాల్లో రైతులు పంట సాగు చేయగా, కొన్ని ప్రాంతాల్లో దిగుబడి మొదలైంది. అయితే పంట మారెటింగ్, ఆయిల్ పామ్ గెలల విక్రయాలపై పలు అనుమానాలుండగా క్షేత్రస్థాయిలోనే కంపెనీలు కొనుగోలుచేస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు ఎట్టకేలకు ములుగు జిల్లా ఇంచర్ల శివారులో కె.ఎన్.బయోసైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో కంపెనీతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం 12 ఎకరాల భూమిని కేటాయించగా, ఫ్యాక్టరీ నిర్మాణంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయిల్ పామ్ పండించే రైతుల కల సాకారం కానుంది.

# రైతు బీమా రెన్యువల్ చివరి తేది ఆగస్టు 14

- జిల్లా వ్యవసాయ అధికారి జాడిబాబు




**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి:**

రైతు కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడం ఎందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం రెన్యూవల్ ప్రక్రియ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతుంది 2018 ఆగస్టు 15 నుంచి అమల్లో అమల్లోకి వచ్చింది ఈ పథకంలో 18 నుండి 59 ఏళ్ల వయసుగల పట్టాదార్ పాస్ బుక్ కలిగిన సాగు రైతులు అర్హులు ప్రమాదం అనారోగ్యం లేదా ఇతర కారణాలవల్ల రైతులు మరణించిన పక్షంలో నామినికి ఎల్ఐసి ద్వారా ఐదు లక్షలు ఒకేసారి అందజేస్తారు ప్రీమియం మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వం భరిస్తుంది ప్రతి సంవత్సరం ఆగస్టు 15 నుంచి తదుపరి ఆగస్టు 14 వరకు భీమా చెల్లుబాటులో ఉండగా రెన్యువల్ లేదా కొత్తగా నమోదు కావాలనుకునే రైతులు సమీపంలోని ఏఈఓ లేదా రైతు వేదికలో గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులకు సూచించారు పాస్ బుక్ ఆధార్ మరియు నామిని వివరాలు తాజాగా ఉండాలని తెలిపారు మరణం సంభవించిన వెంటనే ఏ ఈ ఓ కు సమాచారం ఇచ్చి అవసరమైన పత్రాలు సమర్పించాలి . జూన్ 5.2025 వరకు పట్టా పాస్ బుక్ పొందిన రైతులు అర్హులని జిల్లా వ్యవసాయ అధికారి జాడి బాబు వెల్లడించారు

## శతాధిక పత్రికల సాహిత్య తార
# చిటికెన వెలుగు దీపం

**జయభేరి, సిరిసిల్ల :**

అక్షర సముద్రంలో ముత్యాలు వెదికే కలం, భావ గగనంలో స్వేచ్ఛా పక్షుల విహారం; కథా వనంలో జ్వలించే జ్ఞాన దీపం, కవితా వృక్షంలో పుష్పించే సత్య సుగంధం. వ్యాసరంగంలో చైతన్య జ్యోతి, సమీక్షలో లోతైన స్పర్శ, విమర్శలో వెలుగు-విజ్ఞాన సమ్మేళనం. డా. చిటికెన కిరణ్ కుమార్ పేరులోనే ప్రతిభ గాథ, కలంలోనే యుగ స్వరూపం; సరిహద్దులు దాటి పలికే పదములు, కాలాన్ని దాటి నిలిచే భావములు, మానవతకు అక్షర వాగ్దానం.

తెలంగాణలోని సిరిసిల్ల పట్టణం సాహిత్య చరిత్రలో విశేష ప్రాధాన్యం కలది. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి జన్మభూమిగా ప్రసిద్ధి చెందిన ఈ నేల, మరొక ప్రతిభావంతుడైన సాహిత్యకారుడిని ప్రపంచానికి అందించింది. అతడే పలు జాతీయ అంతర్జాతీయ అవార్డుల గ్రహీత, ఐ. బి.ఆర్.





ఎఫ్ సభ్యులు ప్రముఖ సాహితీవేత్త డా.చిటికెన కిరణ్ కుమార్. బాల్యంలోనే పుస్తకాల పట్ల అసమానమైన మమకారం, వేదికలపై ఏకపాత్రాభినయాలు, దేశ భక్తి గీతాల ప్రదర్శన - ఇవన్నీ ఆయన సృజనాత్మక ప్రయాణానికి బలమైన పునాది వేసాయి. కుటుంబ ప్రోత్సాహం, అనేక సామాజిక పరిస్థితులే ఆయన కలం సమాజం వైపు మళ్లేలా చేసింది. చేనేత కుటుంబంలో కొనసాగుతున్న ఆయన రచనను కర్తవ్యంగా స్వీకరించినారు, తన ప్రతి పదాన్ని సామాజిక చైతన్యానికి అంకితం చేశారు.

చిటికెన రచనలు విభిన్న అంశాలను తాకాయి. చేనేతల జీవన గాథలు ఆయన సృజనలో ప్రత్యేక స్థానాన్ని పొందాయి. "మగ్గం మాట్లాడింది" వంటి కవితలు, కేవలం పదబంధాలు మాత్రమే కాదు - అవి చేనేత వర్గం నాడిని తాకే హృదయ స్పందనలు, ఆయన రాసిన మొదటి కథ లఘు చిత్రంగా రూపుదిద్దుకోవడం, రచయితగా ఆయన ప్రతిభకు గర్వకారణం. చైతన్య స్ఫూర్తి చిటికెన వ్యాసాలు పుస్తకం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా ఆవిష్కరించబడింది. అదేవిధంగా A Case Study on Indian Textile Industry with Reference to Messers Sirisilla Textile Company అనే ప్రాజెక్టు రిపోర్ట్, ఇంకా నాలుగు పుస్తకాలు అముద్రితాలుగా ఆయన సాహిత్య సంపదలో ఉన్నాయి.

సాహిత్య, భాషా సేవలో ఆయనకు లభించిన గౌరవాలు విశేషమైనవి. గిడుగు రామ్మూర్తి పంతులు భాషా సేవ పురస్కారం మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజెట్టి రోశయ్య చేతుల మీదుగా అందుకోవడం, భారతీయ భాషా మంచ్ న్యూఢిల్లీ వారు ప్రదానం చేసిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఎక్సలెన్స్ పురస్కారం, ఆది లీలా ఫౌండేషన్ న్యూ ఢిల్లీ వారు అందించిన జాతీయ సాహిత్య సేవా రత్న, శ్రీలంక దేశ ప్రతినిధులచే అందిన యూఎన్ఐసీసిడిఆర్ పురస్కారం, దక్షిణ కొరియాలో హెచ్‌డబ్ల్యుపిఎల్‌సిఎల్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ప్రపంచ శాంతిల వెబినార్లలో పాల్గొని 7వ, 8వ వార్షికోత్సవ అంతర్జాతీయ ప్రశంస పత్రాలు అందుకోవడం - ఇవన్నీ ఆయన అక్షరయాత్రలో గర్వకారణాలు. అలాగే జపాన్‌లోని క్యూషు యూనివర్సిటీ వెబినార్‌లో పాల్గొనడం, అంతర్జాతీయ మనం బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం ఆయన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశాయి.

ఆయన రచనలు శతాధిక - అంటే వందకు పైగా - పత్రికల్లో అనేకంగా అచ్చు కావడం విశేష ఘనత. అది కేవలం ముద్రణ సంఖ్య కాదే, ఆమోదం పొందిన సృజనాత్మక విలువకు గుర్తింపు. రాష్ట్ర స్థాయి పత్రికల నుంచి జాతీయ, అంతర్జాతీయ పత్రికల వరకు ఆయన వ్యాసాలు, కథలు, కవితలు, సమీక్షలు ప్రాచుర్యంలోకి రావడం, పాఠక హృదయాల్లో నిలిచిపోవడం ఆయన కలానికి లభించిన నిజమైన బహుమతి. పాఠశాలల్లో ఆయన రచించిన "ఎగురుతోంది మువ్వన్నెల జెండా" వంటి దేశభక్తి గీతాలు పాడబడటం, కొత్త తరానికి స్ఫూర్తి నింపుతుంది. అందుకే పలువురు ముఖ్యమంత్రులు,గవర్నర్లు, ప్రముఖ సాహితీవేత్తల చేతుల మీదుగా సన్మాన సత్కారాలు అందుకొన్నారు. పలు సాహితీ సంస్థల నిర్వహించిన సాహిత్య పోటీలలో జూరీగా వ్యవహరించారు. పలువురు కవులు రచయితలు రాసిన పుస్తకాలకు పీఠికలు రాశారు. కిరణ్ కుమార్ కృషి కేవలం సాహిత్యంలోనే కాదు, సమాజ చైతన్యంలోనూ ప్రతిధ్వనిస్తుంది. ఆయన నడిపిస్తున్న ఎలైట్ రైటర్స్ అసోసియేషన్ వందలాది రచయితలను ఒకే వేదికపై కలుపుతోంది. భాష, సాంస్కృతిక విలువలు, శాంతి, పర్యావరణ పరిరక్షణ... ఇవన్నీ ఆయన ధ్యేయాలు. ఒక వ్యక్తి కలం మార్పు తేవగలదని ఆయన సృజన నిరూపిస్తోంది. సాహిత్యం ఆయనకు వృత్తి కాదు, బాధ్యత. ఆయన పేరు తెలంగాణ నేల నుంచి ప్రపంచానికి మార్మోగింది. చిటికెన - కలం, కర్తవ్యానికి ప్రతీకగా నిలిచే అజరామరమైన పేరు.

(వంద పై చిలుకు పత్రికలలో డా. చిటికెన కిరణ్ కుమార్ రచనలు అచ్చు అయిన సందర్భంగా....)

## చంద్రశేఖరా.. ఏమైంది నీ పార్టీకి..
# పతనం దిశగా బీఆర్ఎస్!




**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. మొదటి లక్ష్యం సాధించింది. స్వరాష్ట్రం సిద్ధించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు.. రాష్ట్రం సాధించిన పార్టీగా 2014లో గులాబీ పార్టీకే పట్టం కట్టారు. మరోసారి 2018లో కూడా అవకాశం ఇచ్చారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగింది. కానీ ఇప్పుడు పతనం దిశగా పయనిస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్ వారసుల చెరోదారి.. నాయకత్వ సంక్షోభం, వ్యక్తిగత విమర్శలతో కూడిన సోషల్ మీడియా వ్యూహంతో కొట్టుమిట్టాడుతోంది. గువ్వల బాలరాజు వంటి నాయకుల వలసలు, పార్టీ సోషల్ మీడియా విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాల లేమి వంటి అంశాలు బీఆర్ఎస్ దిగజారుడుకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

**వ్యక్తిగత విమర్శలతో నష్టం..**

బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు వ్యవహారం పార్టీలోని అంతర్గత సమస్యలను స్పష్టంగా తెలియజేస్తోంది. బాలరాజు తన రాజీనామా లేఖలో బీఆర్ఎస్ నాయకత్వాన్ని గౌరవిస్తూనే, తన రాజకీయ భవిష్యత్ కోసం బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ సోషల్ మీడియా బృందం ఆయనను, ఆయన భార్యను వ్యక్తిగతంగా విమర్శిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీ ఇమేజ్‌ను మరింత దిగజార్చింది. రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి వెళ్లడం సర్వసాధారణం. అయితే, వలసపోయే నాయకులపై వ్యక్తిగత దాడులు చేయడం, బూతులతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు చేయడం వంటివి గులాబీ పార్టీకి రాజకీయంగా నష్టం కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచే సోషల్ మీడియా పోస్టులు ఆయనకు తెలియకుండా వస్తున్నవి కావన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి విమర్శలు ప్రజల్లో పార్టీపై చిరాకు, అసహ్యం కలిగించే అవకాశం ఉంది. బాలరాజు స్పందన కూడా ఈ విమర్శలకు బదులుగా తీవ్రంగా ఉండటం, బీఆర్ఎస్ వ్యూహం రివర్స్ అవుతున్నట్లు సూచిస్తోంది.

**సోషల్ మీడియా వైఫల్యం..**


బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యూహాలను ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విధానాలతో పోలుస్తున్నారు. వ్యతిరేకులపై అనుచిత వ్యాఖ్యలు, బూతులతో కూడిన ట్వీట్‌లు, తప్పుడు ప్రచారం చేయడం వంటివి బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన లక్షణాలుగా మారాయి. ఈ విధానం ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడమే కాక, పార్టీకి ఉన్న మద్దతుదారులను కూడా అసంతృప్తికి కారణమవుతోంది. సోషల్ మీడియాను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు, కానీ అది సానుకూలంగా, ఆకర్షణీయంగా ఉండాలి. బీఆర్ఎస్ విషయంలో, సోషల్ మీడియా బృందం ప్రతికూల వ్యాఖ్యలపై దృష్టి సారించడం వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోంది.

ప్రజా సమస్యలపై పోరాటం ఎక్కడ?

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై గ్రౌండ్ లెవల్‌లో ఎలాంటి పోరాటం చేయలేదు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలు ఎక్కువగా రాజకీయ లక్ష్యాలతో లేదా కేసీఆర్ సమస్యల చుట్టూ తిరుగుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలు ఉపాధి, విద్య, ఆరోగ్యం, లేదా రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఎలాంటి ఉద్యమం చేపట్టలేదు. కేవలం రాజకీయ లాభాల కోసం కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పార్టీ ప్రజల నుంచి దూరమవుతోంది. ఒక బలమైన ప్రతిపక్షంగా, ప్రజల సమస్యలను గుర్తించి, వాటి కోసం గళమెత్తి, ఉద్యమాలు నడిపితేనే ప్రజల విశ్వాసం సంపాదించగలదు.

**భవిష్యత్ లేని పార్టీగా?**

బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం లేకుండా కొట్టుమిట్టాడుతోంది. పార్టీ నుంచి నాయకులు వలసపోవడం, సోషల్ మీడియాలో అనుచిత వ్యవహారం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా వ్యక్తిగత దూషణలకు దిగడం, దిగజారుడు మాటలు మాట్లాడడం, ఇక కవిత సొంత పార్టీకి దూరం కావడం, గులాబీ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచినప్పటికీ, ప్రస్తుతం పార్టీలో కొత్త నాయకత్వం, కొత్త వ్యూహాలు అవసరమైన సమయంలో పాత విధానాలతోనే ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తోంది.





## మేనత్తతో అక్రమసంబంధం...
# కాదన్నందుకు మావయ్య హత్య

**జయభేరి, విజయనగరం, ఆగస్టు 11:**

వావివరుసలు మరిచి పశువుల్లా వివాహేతర సంబంధాలు నెరుపుతూ సభ్య సమాజం అసహ్యించుకునేలా ప్రవర్తిస్తున్నారు కొందరు దుర్మార్గులు. అయినవారని కూడా చూడకుండా వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్న వారిని అత్యంత కిరాతకంగా హతమారుస్తున్నారు. విజయనగరం జిల్లాలో జరిగిన ఓ దారుణ ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారింది. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం కెరటాంలో దారుణ హత్య జరిగింది. అక్రమ సంబంధం నేపథ్యంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. విశాఖపట్నం సిటీ గోపాలపట్నంకు చెందిన నారపాటి సాయి(24) అనే యువకుడు పాత నేరస్తుడు. సాయిపై గతంలో పలు క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే సాయి తల్లిదండ్రులు గోపాలపట్నంలోనే ఉంటే మరిన్ని నేరాలకు పాల్పడతాడని కెరటాంలో ఉన్న తమ సమీప బంధువు అయిన నిడిగెట్టి కృష్ణ(40) ఇంటికి పంపించారు. అలా గత రెండేళ్ల క్రితం వచ్చిన సాయి.. మేనమామ కృష్ణ ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలోనే మేనమామ భార్య అయిన మేనత్త రాజుతో చనువుగా ఉండటం ప్రారంభించాడు. ఆ చనువు కాస్తా వివాహేతర సంబంధంకి దారి తీసింది.

అలా మేనమామ ఇంట్లో ఉంటూ మేనత్తతో అక్రమ సంబందం కొనసాగిస్తున్నాడు సాయి. అయితే ఈ విషయాన్ని మద్యం మత్తులో మేనమామ కృష్ణతో చెప్పాడు సాయి. ఆశ్రయమిచ్చిన తనకే ఇంత వెన్నుపోడుచిన సాయిని తన ఇంటిలో ఉండొద్దని కృష్ణ వారిస్తూ తరుచూ గొడవపెడుతూ ఉండేవాడు. అంతేకాకుండా సాయి తన భార్యతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని గ్రామంలోనే పలువురితో కూడా చెప్పుకొస్తున్నాడు కృష్ణ. ఈ విషయంలో వారిద్దరి మధ్య నిత్యం గొడవలు జరిగేవి. వారి వివాదం మరింత ముదిరి తన అక్రమ సంబంధంకి అడ్డుగా ఉన్న మేనమామ కృష్ణని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు సాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల తొమ్మిదవ తేదీ సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో మద్యం తాగుదామని నమ్మించి కృష్ణను ఊరు బయటకు తీసుకెళ్లాడు సాయి. అలా బయటకు వెళ్లిన తరువాత కృష్ణకి పూటుగా మద్యం తాగించాడు. తరువాత మద్యం మత్తులో ఉన్న కృష్ణ పై ఒక్కసారిగా దాడి చేసి గొంతు నులిమి హతమార్చాడు. కృష్ణ మృతి చెందిన తరువాత ఇంటికి వెళ్లి కృష్ణ కుమారుడికి విషయం చెప్పి కృష్ణ కొడుకును తీసుకొని మృతదేహం వద్దకు తీసుకెళ్లాడు నిందితుడు సాయి. అక్కడ నుండి ఇద్దరు కలిసి బైక్ పై వెనక కూర్చోబెట్టుకొని ఇంటికి తీసుకొచ్చి పడుకోబెట్టారు. అలా నిందితుడు సాయికి కృష్ణ కొడుకు జస్వంత్ కూడా సహాయం చేశాడు. తరువాత విషయాన్ని మృతుడు కృష్ణ భార్యకి విషయం చెప్పారు. అలా ముగ్గురు కలిసి కృష్ణ హత్యను.. సహజ మరణంగా చిత్రీకరించి మృతదేహాన్ని గ్రామం బయట ఖననం చేసి చేతులు దులుపుకున్నారు. అయితే గ్రామస్తులకు అనుమానం వచ్చి వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు విషయం తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసుల దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కృష్ణ మృతికి వివాహేతర బంధమే కారణంగా తేల్చారు. వెంటనే పూడ్చి పెట్టిన కృష్ణ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే గ్రామంలో సాయి ఉండటంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు సాయిని నిలదీసి చితకబాదారు. ఆ ఘటనలో గ్రామస్తులు దాడి నుండి తప్పించుకుని నిందితుడు సాయి పరారవ్వడంతో పోలీసులు ముమ్మర గాలింపు చేపట్టారు.ఈ హత్యలో కృష్ణ భార్య రాజు, కృష్ణ కొడుకు జశ్వంత్ పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు. వివాహేతర సంబంధం ఉందని కృష్ణ భార్య కూడా అంగీకరించడంతో కేసు ఒక కొలిక్కి వచ్చినట్లు అయ్యింది. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరుగుతున్న దారుణ ఘటనలు అందరినీ భయాందోళనకు గురిచేస్తున్నాయి.



# ఏ రూపంలో నగదు తీసుకున్నారు?

**విదేశీ యాప్‌లను ఏ విధంగా ప్రమోట్ చేశారు?**

**నాలుగు గంటలపాటు రానాపై ఈడీ పలు ప్రశ్నల వర్షం**

**విచారణకు మంచు లక్ష్మి**


ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో నటుడు రానా దగ్గుబాటి సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. చైనాకు చెందిన జంగ్లీ రమ్మీ ప్రమోట్ చేసిన రానాపై ఈడీ ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. ప్రధానంగా చైనా కేంద్రంగా నిర్వహించిన జంగ్లీ రమ్మీని ప్రమోట్ చేసేందుకు ఎంత డబ్బు తీసుకున్నారు? దానిని ఏ రూపంలో తీసుకున్నారు? అని ప్రశ్నించినట్టు సమాచారం. పలు బెట్టింగ్ యాప్స్ కంపెనీలతో జరిగిన అగ్రిమెంట్లు, అకౌంట్లలో డిపాజిట్స్‌పై కూడా ఈడీ అధికారులు లోతుగా ప్రశ్నించినట్టు తెలిసింది.

ఈడీ ఆదేశాల మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ జోనల్ కార్యాలయానికి ఉదయం 10.45 గంటలకు చేరుకున్న ఆయనను మధ్యాహ్నం 3గంటల వరకూ ఈడీ అధికారులు విచారించారు. జంగ్లీ రమ్మీ యాప్స్ ప్రమోట్ చేసేందుకు చేసుకున్న అగ్రిమెంట్లు, గత మూడేండ్లకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్ల ఆధారంగా ప్రశ్నించినట్టు సమాచా రం. ఈ సందర్భంగా ఆయన బ్యాంకు ఖా తాల్లో పలు అనుమానాస్పద లావాదేవీల గుర్తించినట్టు తెలిసింది. ఇదే కేసులో బుధవారం మంచు లక్ష్మి విచారణకు హాజరుకావాల్సి ఉంది.

**ఇండియాలో చైనా యాప్స్ ఆపరేషన్లు**

ఇదే కేసులో జులై 30న ప్రకాశ్‌రాజ్, ఈ నెల 6న విజయ్ దేవరకొండలను ఈడీ విచారించింది. చైనా బెట్టింగ్ యాప్స్ ఇండియాలో పలు కంపెనీలు ఆపరేట్ చేస్తున్నాయి. వీటితో రానా దగ్గుబాటి సహా సెలబ్రిటీలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే యాప్స్ కంపెనీల నుంచి అందిన పారితోషికం సహా రానా అకౌంట్లలో పెద్ద మొత్తంలో జరిగిన లావాదేవీలను ఈడీ అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే సెలబ్రిటీల అకౌంట్లలో పెద్ద మొత్తంలో అయిన డిపాజిట్లు, ఇతర ఖాతాలకు నగదు బదిలీపై విశ్లేషణ చేస్తున్నారు.

# నాకంటూ ఓ చరిత్ర ఉంది




రవితేజ నటిస్తున్న కమర్షియల్ ఎంటైర్టైనర్ 'మాస్ జాతర'. ఇది రవితేజ నటిస్తున్న 75వ చిత్రం కావడం విశేషం. శ్రీలీల కథానాయిక. రచయిత భాను భోగవరపు దర్శకునిగా పరిచయం అవుతున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదలకానుంది. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు.

రవితేజ నుంచి ఆడియన్స్ ఆశించే అన్ని అంశాలూ 'మాస్ జాతర'లో ఉన్నట్టు టీజర్ చెబుతున్నది. టీజర్‌లో రవితేజ వింటేజ్ ఎనర్జీతో కనిపిస్తున్నారు. రవితేజ శైలి యాక్షన్‌తో నిండిన ఫుల్ మీల్స్ మాస్ ఎంటైర్టైనర్ ఇదని, మాస్ అంశాలతోపాటు వినోదాన్ని మేళవిస్తూ దర్శకుడు భాను భోగవరపు ఈ సినిమాను మలిచారని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మాణం: సితార ఎంటైర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.

# అర లీటర్ 150..



దీపం ఉండగానే ఇల్లు చక్కచెట్టుకోవాలనుకుంటున్నారు స్టార్ హీరోలు, హీరోయిన్లు. అందుకే ఓ వైపు సినిమాలు చేస్తూనే మరోవైపు రకరకాల బిజినెస్ లు చేస్తున్నారు. సమంత, రష్మిక మందన్నా, దీపికా పదుకొణె, అలియా భట్.. ఇలా స్టార్ హీరోయిన్స్ సైతం ఏదో ఒక వ్యాపారంలోకి అడుగు పెడుతున్నారు. కోట్లాది రూపాయలు ఆర్జిస్తూ సక్సెస్ ఫుల్ బిజినెస్ వుమన్స్ గానూ పేరు గడిస్తున్నారు. తాజాగా మరో స్టార్ హీరోయిన్ బిజినెస్ రంగంలోకి అడుగు పెట్టింది. తన సోదరితో కలిసి ఒక వాటర్ బ్రాండ్ కంపెనీని స్థాపించింది. ఇక్కడ అరలీటర్ వాటర్ బాటిల్ రూ. 150, అలాగే 750 ml వాటర్ బాటిల్ ధర రూ. 200లకు లభిస్తోంది. ఏంటి ఇంత రేట్లా? ఎవరు కొంటారు వీటిని అనుకునేరు? అయితే ఈ వాటర్ లో ఆరోగ్యానికి ఉపకరించే ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఈ హిమాలయ వాటర్ లో సహజసిద్ధమైన మినరల్స్, ఎలెక్ట్రోలైట్స్ పుష్కలంగా ఉంటాయట. ముఖ్యంగా చాలా మంది ఇప్పుడు ఎక్కువగా ఎనర్జీ డ్రింక్స్ పైనే ఆధారపడుతున్నారు. పైగా వీటి కోసం భారీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. అలాంటి వాటికి ప్రత్యామ్నాయంగా ఈ హిమాలయ వాటర్ ను అందుబాటులోకి తీసుకొచ్చామంటోందీ స్టార్ హీరోయిన్. ఇంతకీ ఆమె ఎవరనుకుంటున్నారా? బాలీవుడ్ స్టార్ హీరోయిన్ భూమి పడ్నేకర్. ప్రస్తుతం సినిమాల్లో బిజీగా ఉంటోన్న భూమి తన సోదరి సమీక్షా పడ్నేకర్ తో కలిసి బ్యాక్‌బే ఆక్వా అనే వాటర్ బ్రాండ్ కంపెనీని స్థాపించింది. తాజాగా ఈ వాటర్ వల్ల ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టిందీ అందాల తార. 'మాది ప్రీమియం వాటర్ బ్రాండ్ కంపెనీ. మూడు రకాల ఫ్లేవర్లలో లభ్యం అవుతుంది. దీని స్పెషాలిటీ ఏంటంటే.. ప్యాకేజింగ్ కోసం ప్లాస్టిక్‌ను వాడలేదు. బాటిల్ క్యాప్ కూడా సులభంగా భూమిలో కలిసిపోయేదిగా తయారు చేశాం. పూర్తిగా పర్యావరణ స్పృహతో ఈ వాటర్ కంపెనీని స్టార్ట్ చేశాం' అని తెలిపింది భూమి.




# వాహనంలో ప్రయాణం వివాదంపై స్పందించిన నిధి

భీమవరంలో జరిగిన ఓ స్టోర్ లాంచ్ ఈవెంట్‌కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనంలో నిధి హాజరు కావడం ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో నిధి అగర్వాల్ తన అధికారిక ఎక్స్ (Twitter) ఖాతాలో స్పందిస్తూ, ఈ వివాదంపై స్పష్టత ఇచ్చారు. "భీమవరంలో జరిగిన ఈవెంట్‌లో పాల్గొనడానికి నిర్వాహకులు నాకు రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు. వారు పంపిన వాహనం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందినదై ఉండొచ్చు. కానీ, వాహనం ఎంపికలో నా పాత్ర ఏమీ లేదు. ఇది కేవలం లాజిస్టికల్ అవసరాల కోసమే నిర్వాహకులు అందించిన సదుపాయం" అని నిధి తెలిపారు. అంతేకాకుండా, కొన్ని ఆన్‌లైన్ వేదికల్లో "ప్రభుత్వ అధికారులు నిధి కోసం ప్రత్యేక వాహనం పంపించారు" అనే తప్పుడు ప్రచారం జరుగుతుండటాన్ని ఆమె ఖండించారు. "ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ప్రభుత్వ అధికారులెవ్వరూ నాకోసం ప్రత్యేకంగా వాహనం పంపలేదు. ఈ వ్యవహారంలో నాకు ఎలాంటి సంబంధం లేదు. తప్పుడు సమాచారం ప్రచారం కాకుండా ఉండేందుకు నిజాలను బయటపెట్టడం నా బాధ్యత" అని పేర్కొన్నారు. చివరగా, ఆమె తన అభిమానులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, "మీ ప్రేమ, మద్దతు పట్ల ఎప్పుడూ కృతజ్ఞతలు. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" అని నిధి అగర్వాల్ పేర్కొన్నారు.

# ఆ ఇద్దరిలో ఒకరు కాదట.. తారక్, హృతిక్ రోషన్ వార్ 2 విలన్ ఎవరో



తెలుగుతోపాటు హిందీ మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ వార్ 2 (War 2). అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో తెరకెక్కిన వార్ 2లో జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ మూవీ ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తారక్, హృతిక్ రోషన్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. కాగా ఇందులో విలన్ ఎవరనేది ఇప్పటికీ సస్పెన్స్‌గా ఉంది. తాజాగా ఇదే విషయంపై క్లారిటీ ఇచ్చి అభిమానుల్లో ఫుల్ జోష్ నింపారు మేకర్స్. వార్ 2లో తారక్, హృతిక్ రోషన్‌లో ఇద్దరిలో ఒకరు నెగెటివ్ రోల్‌లో కనిపించబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో విలన్ కూడా ఈ ఇద్దరిలో ఒకరై ఉంటారని అంతా అనుకున్నారు. అయితే మరో 3 రోజుల్లో సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో యశ్ రాజ్ ఫిలింస్ చాలా రోజుల సస్పెన్స్‌కు తెరదించింది. ఈ చిత్రంలో పవర్ ఫుల్ విలన్ ఉన్నాడు. ఇంతకీ అతడెవరనుకుంటున్నారా..? యానిమల్ సినిమాతో ఓవర్‌నైట్ సూపర్ స్టార్‌డమ్ కొట్టేసిన బాబీ డియోల్. యశ్‌రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడం థ్రిల్లింగ్‌గా ఉందన్నాడు బాబీ డియోల్. ప్రత్యేకించి ఇలాంటి ఫ్రాంఛైజీ ప్రాజెక్టులో తానెప్పుడూ నటించలేదని చెప్పాడు. డైరెక్టర్ అయాన్ ముఖర్జీ తన పాత్రను పవర్ ఫుల్ స్క్రీన్ ప్రజెంటేషన్‌తో డిజైన్ చేశాడని అన్నాడు బాబీ డియోల్. తారక్, హృతిక్ రోషన్ పాత్రలు ఎమోషనల్ లింక్‌తో సాగుతూ సిల్వర్ స్క్రీన్‌పై చూస్తున్న ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇస్తాయని మేకర్స్ స్పష్టం చేశారు. స్పై యూనివర్స్‌లో వచ్చిన టైగర్ 3లో ఇమ్రాన్ హష్మీని విలన్‌గా చూపించిన మేకర్స్.. ఇప్పుడిక ఈ ఫ్రాంఛైజీలో వస్తున్న వార్ 2లో బాబీ డియోల్‌ను పెట్టి అంచనాలు భారీగా పెంచేస్తున్నారు. కియారా అద్వానీ గ్లామర్, తారక్, హృతిక్ రోషన్ యాక్షన్ పార్ట్, బాబీ డియోల్ పవర్ ఫుల్ ప్రజెంటేషన్ సినిమాలను మరో స్థాయికి తీసుకెళ్తాయనడంలో ఎలాంటి సందేహం లేదని ధీమాతో ఉన్నారు మూవీ లవర్స్.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com